




పర్యాటక.. కడియం!

పచ్చటి నర్సరీలకు.. పర్యాటక శోభ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కడియం నర్సరీలు.. కంటికి కనిపించే స్వర్గధామం.. వేల రకాల మొక్కలు..అరుదైన పండ్ల జాతులు.. ఔషధ మొక్కలు..ఇదో మొక్కల లోకం..కనువిందు చేసే ప్రపంచం..ఊళ్లకు ఊళ్లలో పరుచుకున్న ఈ వనానికి మరింత హంగులు అద్ది.. మెరుగులు దిద్ది అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించేవిధంగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో 14 ఏకో టూరిజం ఎక్స్ పీరియన్స్ సెంటర్లను నిర్మిస్తుండగా ఉమ్మడి తూర్పుగోదావరికి కడియం నర్సరీలకు ఆ అవకాశం దక్కింది. టూరిజం శాఖ తాజాగా రూ.4.95 కోట్లతో టెండరు పిలిచింది. కాంట్రాక్టరుతో ఒప్పందం అనంతరం పనులు ప్రారంభమవుతాయి. నర్సరీల్లోని మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి.. పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేస్తారు. అంతర్గత రోడ్లు, అదనపు హంగులు జోడిస్తారు. వివిధ రకాల మొక్కల ప్రదర్శన, చిన్న ఎగ్జిబిషన్లు,సీజనల్ పుష్పోత్స వాలు, గోదారోళ్ల రుచుల రెస్టారెంట్లు, కాఫీ షాపులు, చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్, పార్కింగ్ ఏరియాలు,కాలువగట్టు బ్యూటిఫికేషన్, బోటింగ్ ఏర్పాటు చేస్తారు. పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా ఒక పెద్ద ఆర్చిని నిర్మిస్తారు. పొట్టిలంక నుంచి కడియపులంక వరకూ 28 స్టాల్స్‌ని నిర్మిస్తారు. పర్యాటకులకు వసతి కల్పిస్తారు. నర్సరీలతో ముడిపడిన అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారిస్తారు. మొత్తంగా కడియం నర్సరీలను విదేశీ పర్యాటకులు సైతం ఔరా అనే విధంగా తీర్చిదిద్దుతారు. కడియం, కడియపులంక, వేమగిరి, మురముండ, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, దుళ్ల, కడియపుసావరం, మండపేట రూరల్ మండలంలోని పాలతోడు, వెలగతోడు తదితర ప్రాంతాల్లోని సుమారు 5 వేల ఎకరాలకుపైగా నర్సరీలు విస్తరించి అందరినీ ఆకర్షిస్తున్నాయి.





తీర్చిదిద్దుతాం: 'తూర్పు' కలెక్టర్

కడియం నర్సరీలను పర్యాటకపరంగా తీర్చిదిద్దే విధంగా ఒక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. దీంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. గ్రీన్ ఆర్గానిక్ వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులను తయారుచేయిస్తాం.



అంతర్జాతీయ ఖ్యాతి ఖాయం: మంత్రి దుర్గేష్

కడియం నర్సరీలకు అంతర్జాతీయంగా ఖ్యాతిని తీసుకొస్తాం. ఈకో టూరిజం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. కాలువ గట్టును కూడా అభివృద్ధి చేస్తున్నాం.



అలా.. కొనిచ్చేద్దాం!

రూపుల ధరలు ఇలా..

కాణిఎత్తు	200 మిల్లీగ్రాములు	రూ.2,280
అర్ధణా	350మిల్లీ గ్రాములు	రూ.3,800
అణా	700 మిల్లీ గ్రాములు	రూ.7,300
అర గ్రాము		రూ.5,300
గ్రాము		రూ.10,250



గ్రాము రూపు కొనాలన్నా కష్టమే

- శ్రావణంలోనూ బంగారమే!
- కాణి రూపులకు డిమాండ్
- పెరిగిన బంగారం ధరలే కారణం
- పది గ్రాములు రూ.99,930
- గ్రాము రూపు రూ.10,250
- కొనుగోలుదారుల వెనకడుగు
- ఆచితూచి వ్యాపారుల అడుగులు

శ్రావణమాసం వచ్చిందంటే బంగారానికి ఎక్కడ లేని డిమాండ్ వచ్చి పడేది.. ఎందుకంటే ప్రతి కుటుంబంలో ఒక గ్రాము లక్ష్మీదేవి రూపు కొనుగోలు చేయాలనే తలంపు ఉండేది.. ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో గ్రాము బంగారం మోయలేక చాలా మంది కాణి రూపుల వైపు చూస్తున్నారు.. మరికొంత మంది అయితే బంగారానికి ప్రత్యామ్నాయం ఏమిటా అని ఆలోచిస్తున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

శ్రావణం అంటేనే సర్వ శుభకరం.. శుభ ఘడియలే..పండుగలు, వివాహాలు, గృహ ప్రవేశాలు,పూజలు,నోములు, వ్రతాలు.. ఇలా ఈ మాసమంతా శుభకార్యాలు, ఆధ్యాత్మిక శోభతో అలరారుతుంది.అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడుతుంటాయి. మహిళలు ఈ మాసమంతా ఇంటిని లక్ష్మీదేవి ఆలయంగా భావిస్తూ ధూప, దీప నైవేద్యాలతో కొలుస్తారు. ఇక ఇది ముహూర్తాల నెల కావడంతో బంగారానికి డిమాండ్ ఉన్నా.. మంగళ సూత్రాలు, తాడు, ఉంగరాలు వంటి ప్రధానమైన వాటితో సరిపెడుతున్నారు. పసిడి ధరలు పరిగణనలోకి తీసుకుని వరలక్ష్మి రూపులు కాణితో సరిపెడుతున్నారు.

ఏడాదిలో రూ.29 వేల పెరుగుదల

బంగారం ధరలు గత మూడేళ్ల నుంచీ పరుగులు పెడుతున్నాయి. గత ఏడాది ఇదే నెలలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.70 వేలు ఉంది. శనివారం చూస్తే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,930లు ఉంది. 22 క్యారెట్ల ధర రూ.91,600 ఉంది. దీంతో గ్రాము రూపునకు రూ.11 వేలు వెచ్చించాల్సి వస్తోంది. 700 మిల్లీ గ్రాములు అణా ఎత్తుకు రూ.8 వేలు, 350 మిల్లీల అర్ధనాకు రూ.4 వేలు చెల్లించాల్సి వస్తోంది. కనీసం 200 మిల్లీల కాణి ఎత్తు కొందామన్నా రూ.2500 వరకూ ఉంది. ఇది ఒకసారి కిందపడితే మళ్లీ కంటికి కనిపించనంత పరిమాణంలో ఉంటుంది. ప్రస్తుత ధరలు చూస్తే వెండి రూపులకు డిమాండ్ పెరగొచ్చని చెబుతున్నారు. వెండి కేజీ రూ.1,18,000లు ఉంది. ఇత్తడి, రాగి రూపుల ప్రసక్తి ఇప్పటివరకూ లేదు. బంగారం ధరలను బట్టి అవి కూడా మార్కెట్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

రూ.200 కోట్ల వ్యాపారం?

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 వరకూ పెద్ద మాల్స్ ఉండగా.. 2 వేల వరకూ మామూలు దుకాణాలు ఉన్నాయి. ఓ మూడేళ్ల కిందట వరకూ శ్రావణం వచ్చిందంటే సుమారు రూ.200 కోట్ల వ్యాపారం జరిగేది. దీంట్లో రూ.50 కోట్ల వరకూ రూపుల వ్యాపారమే ఉండేది. కానీ ఇప్పుడు ఆ అంకె కాస్త అటూ ఇటుగా అలాగే ఉన్నా కొనుక్కొనే వారి సంఖ్య మాత్రం తగ్గినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు గ్రాము రూ.10 వేల చొప్పున ఓ వంద రూపులు అమ్మితే రూ.కోటి వ్యాపారం జరిగిపోతోంది. ప్రస్తుత ధరల వల్ల జనం వెనక్కి తగ్గుతుండడంతో వ్యాపారులు వెన కడుగు వేస్తున్నారు. రూపుల వ్యాపారాన్ని ఈసారి విరమించుకున్నామని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. అయితే శ్రావణం, ముహూర్తాల వల్ల ఓ 20 రోజుల నుంచీ వ్యాపారం బాగానే జరుగుతోం దని మరికొందరు అంటున్నారు. ఇక సెంటిమెంటుగా.. ఎప్పుడూ గ్రాము రూపే అని భావించే వాళ్లు అప్పు చేసైనా కొంటున్నారు.

అపురూపమే!

శ్రావణంలో వరలక్ష్మీ వ్రతానికి ఎంత విశిష్టత ఉందో.. పసిడికీ అంతే ప్రాధాన్యం ఇస్తారు. వ్రతంలో లక్ష్మీదేవి మెడలో రూపును అలంకరించి ఆ అమ్మవారు తన ఇంట కొలువైనట్టు భావిస్తారు. కానీ ప్రస్తుతం బంగారం గారం పోతోంది. గతంలో గ్రాము రూపును అలంకరించిన వాళ్లు ఈసారి కాణి ఎత్తుకూ జంకే విధంగా ధరలున్నాయి. రూపు కొనాలంటే రుణం తప్పదనే నానుడికి జీవం పోస్తున్నాయి. కొన్ని బంగారు దుకాణాల వారు అసలు రూపు జోలికి వెళ్లడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఈ సారైనా కలిసొచ్చేనా..

మూఢం కారణంగా 48 రోజుల పాటు శుభ ముహూర్తాలు లేవు. దీంతో పసిడి విక్రయాలు నెమ్మదించాయి. శ్రావణమాసం ఈ శుక్రవారం 25వ తేదీ నుంచి ప్రారంభం కావడంతో మళ్లీ పసిడి కొనుగోళు ఊపందుకుంటున్నాయని భావిస్తున్నారు.జూలై నెలలో 26, 30, 31 ఆగస్టులో 1, 3, 5, 7 నుంచి 14, 17 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి.శ్రావణం తర్వాత ఆగస్టు 21 నుంచి భాద్రపద మాసం ప్రారంభమవుతుంది. శూన్యమాసం కాబట్టి ముహూర్తాలు ఉండవు. మళ్లీ సెప్టెంబరు 23 నుంచి ఉంటాయి. 8న వరలక్ష్మీ వ్రతం,16 శ్రీ కృష్ణాష్టమి ఉన్నాయి.

లే అవుట్ల క్రమబద్ధీకరణకు

గడువు పొడిగింపు

- జూన్ 30 లోపు రిజిస్టర్ అయిన ప్లాట్‌లకు మాత్రమే అవకాశం
- జీవో విడుదల



కార్పొరేషన్(కాకినాడ),జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనధికారిక లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) గడువును పొడిగిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ జీవో ఎంఎస్ నెంబర్ 134 శనివారం విడుదల చేశారు. దీంతో కాకినాడఅర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కౌడా) పరిధిలోని అనధికార లేఔట్లకు, ఇళ్ల స్థలాలకు ప్రజలు కట్టడాల అనుమతులపై ఎదురవుతున్న సమస్యలు పరిష్కారానికి మార్గం సుగమమైంది. ఈ జీవో ప్రకారం 2025, జూన్ 30 లోపు రిజిస్టర్ అయిన ప్లాట్‌లకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం కల్పిస్తారు. జరిమానా చార్జీలు భూమి విలువ ఆధారంగా, పరిమాణం, స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ఆధారంగా ప్రాథమిక, వాస్తవ జరిమానా చార్జీలు వసూలు చేయనున్నారు. వీటిలో ఓపెన్ స్పేస్ అందుబాటులో లేనిపక్షంలో ప్లాట్ విలువపై 14శాతం అదనపు చార్జీ విధించనున్నారు. ఈ తాజా నిర్ణయంతో లబ్ధిదారులు స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి మరోసువర్ణావకాశం లభించింది.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనుంచి అందిన దరఖాస్తులను త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తంగా 486 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 449 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. మిగిలిన 37 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాలకు రూ.67.44లక్షలు విలువైన రాయితీ ప్రయోజనాల జారీ కమిటీ ఆమోదించిందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, జిల్లా పరిశ్రమ లశాఖ జీఎం గణపతి, ఏడీ విజయ్‌కుమార్, రవాణాశాఖాధికారి శివారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణమూర్తి, డీఎఫ్‌వో రాజేష్, గ్రౌండ్‌వాటర్ డీడీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుమారుడి ప్రతిభకు ఎస్పీ అభినందనలు



హన్నిత్‌ను అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడక్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్‌లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ క్రీడల్లో రజిత పతకం సాధించిన కాకినాడకు చెందిన ఏడేళ్ల కుంచే హన్నిత్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఎస్పీ జి.బిందుమాధవ్ శనివారం అభినందించారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజేష్ కుమారుడు హన్నిత్ రెండో తరగతి చదువుతూ రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ చూపుతున్నాడని ఎస్పీ కొనియాడారు. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన ఓపెన్ నేషనల్స్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించాడన్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన పోటీల్లో సిల్వర్‌మెడల్, జిల్లాస్థాయి పోటీల్లో బంగారు, వెండిపతకాలు, ఏపీఆర్‌ఎస్‌ఏ 36వ రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి, కాంస్య పతకాలు, కర్ణాటకలోని మైసూర్‌లో 62వ ఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ పోటీల్లో జాతీయస్థాయిలో వెండిపతకం సాధించాడన్నారు. ఏపీఆర్‌ఎస్‌ఏ జో న్-2 పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించాడన్నారు. పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు ఉత్తమ ప్రతిభ కనబర్చడం జిల్లా పోలీస్‌శాఖకు గర్వకారణమన్నారు.

సముద్రపు నాచు మొక్కల పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ



నాచు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఫిషరీష్ ఏడీ అంజలి

కొత్తపల్లి,జూలై 26(ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచుమొక్కల పెంపకం ద్వారా తీరప్రాంత మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్, మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎస్.అంజలి తెలిపారు. కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, తొండంగి మండలంలోని గోర్సపాలేనికి చెందిన మత్స్యకారులకు సముద్ర నాచుమొక్కల పెంపకంపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తీరప్రాంత మత్స్యకారులకు ప్రత్యామ్నాయఉపాధి,ఆదాయ మార్గాలను కల్పించి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు తీరప్రాంతాల్లో సముద్రనాచుమొక్కల పెంపకం మంచి జీవనోపాధికి మార్గంగా ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. 45రోజులపాటు పెంపకం చేసే విధానంపై పవవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాలో అమీనబాద్, గోర్సపాలెం తీరప్రాంతాలు సముద్ర నాచు మొక్కల పెంపకానికి అనువైనవిగా గుర్తించామని తెలియజేశారు. ఉప్పాడ, గొరసపాలెంనుంచి 60మంది నాచుమొక్కల పెంపకం శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన వైద్యవిభాగంప్రతినిధి, సురక్ష మల్టీస్పెషాల్టీ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, పీటీసీ డీసీ1 చైర్మన్ మురలాశెట్టి సునీల్ కుమార్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కె.కరుణాకరరావు,ఉప్పాడ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రామకృష్ణ, జనసైనికులు వాడ్రదనబాబు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా తేలికపాటి జల్లులు

- మండలాలవారీగా వర్షపాతం వివరాలివి

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షపాతం నమోదైంది. శుక్రవారంఉదయం 8గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు వర్షపాతం మండలాలవారీగా వివరాలివి. జగ్గంపేటమండలంలో అత్యధికంగా 16.6 మి.మీ కురిసింది. కాజులూరు మండలంలో 14.4మి.మీ, తాళ్లరేవులో 13.4మి.మీ, కరప 12.4, ఏలేశ్వరం 12.2, గండేపల్లి 12.2, ప్రత్తిపాడు 12, తొండంగి 11.2, గొల్లప్రోలు 11.2, కిర్లంపూడి 10.8, పెద్దాపురం 10.8, సామర్లకోట 10.4, శంఖవరం 10, కాకినాడ అర్బన్ 9.4, యు.కొత్తపల్లి 9.2, పిఠాపురం 8.6మి.మీ, కోటనందూరు 8.4, తుని 8.4, కాకినాడ రూరల్ 7.4, రౌతులపూడి 6.6, పెదపూడి 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది.జిల్లా సరాసరి వర్షపాతం 10.5మి.మీ నమోదైంది.

'పురుషోత్తపట్నం' నుంచి సాగునీరు విడుదల

- మంత్రిని అభ్యర్థించిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ
- నీటిని విడుదల చేసిన జలవనరులశాఖ మంత్రి

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జగ్గంపేట మండలం రామవరం వద్ద ఉన్న పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం స్టేజ్-2 నుంచి ఏలేరు రిజర్వాయర్‌కి సాగునీటిని విడుదల చేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. పురుషోత్తపట్నం నుంచి సాగునీటిని ఆగస్టు తొలి వారంలో విడుదల చేయాల్సి ఉండగా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పిఠాపురంలో రైతుల సమస్యలపై చర్చించి వర్షాభావ పరిస్థితులను మంత్రికి వివరించారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన అభ్యర్థన మేరకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి రామానాయుడు ఈనెల 25వతేదీనే నీటిని విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారన్నారు. త్వరగా నీటిని విడుదల చేయడం వల్ల ఏలేరు శివారు భూములకు సాగునీరు వెళ్తుందన్నారు. ఇకనుంచి సాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు. సాగునీటి విడుదల సమయాన్ని అనుసరించి ఖరీఫ్ పంటలను రైతులు సాగు చేసుకోవాలన్నారు.

రెండేళ్లలో డీసీసీబీని లాభాల బాట పట్టిస్తాం

- డీసీసీబీ చైర్మన్ రామస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నష్టాల్లో ఉన్న కాకినాడ డీసీసీబీని రాబోయే రెండేళ్లలో లాభాల బాటలో నడిపించేందుకు చర్యలు చేపడతామని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. కాకినాడలోని డీసీసీబీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 52 డీసీసీబీశాఖల మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, ఏజీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. రుణాల వసూళ్లు బాగుండాలని, డిపాజిట్లను పెంచాలని ఎన్‌పీఏల మీద దృష్టి పెట్టాలని, సిబ్బంది డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలని చైర్మన్ సూచించారు. గతంలో బినామీల పేర్లతో అధికంగా రుణాలు ఇచ్చిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పిఠాపురం శాఖ పరిధిలోని బి.కొత్తూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని తిరిగి కట్టడం లేదన్నారు. చిన్నగ్రామమైనప్పటికీ ఆగ్రామంలో లేనివారి పేర్లతో కూడా రుణాలు తీసుకుని తిరిగి బ్యాంకుకు ఒక్కరూపాయి కూడా చెల్లించడం లేదని తెలిపారు. ఈ విధమైన రుణాలు మంజూరుకు ఏఏ అధికారులు సహకరించారో వారిపై చర్యలు తప్పవని, రుణాల రికవరీకి సిబ్బంది అంతా కలిసి వెళ్లాలన్నారు. పాతరుణాలు రికవరీ లేకుండా రైతులకు కొత్తరుణాలు ఏ విధంగా మంజూరు చేయాలని సిబ్బందిని ప్రశ్నించారు. అన్నిశాఖల బీఎంలు, సిబ్బందిని ఇప్పటివరకూ ఎంత మేరకు రుణాలు ఇచ్చారు, తిరిగి ఎంత చెల్లించారు.. రికవరీకి తీసుకుంటున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాల బంగారు రుణాలు పెంచాలి సూచించారు. సమావేశంలో డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈవో పి.ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్‌చౌదరి పాల్గొన్నారు.

ఏపీ శాసన గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా రంప ఎమ్మెల్యే శిరీష 7
- 12మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన స్పీకర్ అయ్యన్న

ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల మూసివేత
- అధిక వర్షాల కారణంగా నిర్ణయం : ఐటీడీఏ పీవో 7

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ మెయిన్

సాంకేతిక పొరపాటు.. గ్రీవెన్స్ సిబ్బంది తప్పిదం

- 'మీ పరిష్కారానికో నమస్కారం' కథనంపై స్పందించిన ఆర్టీసీ అధికారులు
- ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని వివరణ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కలెక్టరేట్‌లో నిర్వహిస్తోన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వస్తున్న అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని, సమస్యలు పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్టుగా అర్జీదారులకు మేసేజ్‌లు పంపడంతోపాటు పీజీఆర్‌ఎస్ పోర్టల్‌లో ఒక అర్జీదారుడికి బదులుగా మరో అర్జీదారుడి ఫొటో పొందుపరచడం, పీజీఆర్‌ఎస్ ఒక ఫిర్యాదుదారుడి ఫిర్యాదు నెంబర్‌కు బదులుగా వేరొక నెంబర్ వేసి అర్జీని పరిష్కరించినట్టుగా తెలియజేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'మీ పరిష్కారానికో నమస్కారం' అంటూ ప్రచురించిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ కథనంలో ఇద్దరు ఆర్టీసీ సిబ్బంది తమ సమస్యలను కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించగా.. వాటికి సంబంధించి పీజీఆర్‌ఎస్‌పోర్టల్‌లో అర్జీలో అతడి ఫొటోకు బదులు వేరొకరి ఫొటో, అర్జీ ఫిర్యాదు నెంబర్ బదులుగా వేరే ఫిర్యాదు నెంబర్ వేసి సమస్య పరిష్కరించినట్టుగా బదులిచ్చారని ఆధారాలతో వివరించడం జరిగింది. దీనికి స్పందించిన ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చారు.

'అర్జీ ఒకరిది.. ఫొటో మరొకరిది' శీర్షికకు సంబంధించి ఫిర్యాది దంగేటి శ్రీను ఫొటోకు బదులుగా వేరొక ఫొటోను తప్పుగా జతపరిచామని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని, సాంకేతి సమస్య కారణంగా జరిగిన ఈ పొరపాటును భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకుంటామని జిల్లా ప్రజారవాణాధికారి శనివారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు.

'అర్జీ ఒకరిది.. పేరు మరొకరిది' విషయానికి సంబంధించి.. చీకట్ల కృష్ణయ్య ఫిర్యాదు నెంబర్ కెకెడి02025052662З9కు బదులుగా కరప మండలానికి చెందిన వేరొక ఫిర్యాదుదారుడు తుమ్మలపల్లి కృష్ణ ఫిర్యాదు నెంబర్ కెకెడి02025052662277తో అర్జీని పరిష్కరించినట్టుగా పీజీఆర్‌ఎస్ పోర్టల్‌లో పొందుపరచడం కూడా సాంకేతిక కారణమని వివరణ ఇచ్చారు. జిల్లా గ్రీవెన్స్ కార్యాలయం నుంచి తప్పుగా మ్యాపింగ్ చేసి తమ ఆర్టీసీ కార్యాలయానికి రావడం వల్లే ఇలా జరిగిందని, ఇది పూర్తిగా జిల్లా కలెక్టరేట్లోని గ్రీవెన్స్‌లో తప్పుడు మ్యాపింగ్, సాంకేతిక సమస్య వల్ల జరిగిందని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి వివరణ ఇచ్చారు.

'ఆశా' ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీఎంహెచ్‌వో నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 42ఆశాకార్యకర్తల ఉద్యోగాల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్‌లోని అభ్యర్థులు ఖాళీల జాబితాలో సూచించిన గ్రామంలో నివాసం ఉండి వార్డ్, గ్రామం కోడలు అయితే వారిని అర్హులుగా పరిగణిస్తామన్నారు. దరఖాస్తు చేసినవారిలో అభ్యర్థుల అర్హతను బట్టి పారదర్శకంగా ఎంపిక చేస్తామని డీఎంహెచ్‌వో వెల్లడించారు. అభ్యర్థులు ఆశా పోస్టుల నియామకంకోసం దళారులను నమ్మి ఎవరికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. ఈ నియామకాలు డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ(డీహెచ్ఎస్) ఆధ్వర్యంలో UHNC/VHNC కమిటీ తీర్మానించిన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుని డీహెచ్‌ఎస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ తెలిపారు.

ఉచిత గ్యాస్.. బుక్ చేశారా?



- రెండో ఉచిత సిలిండరు బుకింగ్‌కు నెలాఖరు వరకే సమయం
- 31వ తేదీతో గడువు ముగింపు
- ఆగస్టు 1 నుంచి మూడో సిలిండరు బుకింగ్ ప్రారంభం
- నవంబర్ నెలాఖరు వరకు దీనికి గడువు
- తొలి సిలిండర్ బుక్ చేసుకున్నది 12 లక్షల 56 వేల మంది..
- రెండో సిలిండర్ ఇప్పటికే బుక్ చేసుకున్న వారు 12 లక్షల11 వేల మంది

ఇక ఐదురోజులే మిగిలింది.. దేనికీ అనుకుంటున్నారా..? ఉచిత 'గ్యాస్' సిలెండర్ పొందడానికి.. ఈనెలాఖరు వరకే సమయం ఉంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 ఉచితగ్యాస్ సిలిండర్ల పథకానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. మొదటి సిలిండర్‌ను పెద్దఎత్తున లబ్ధిదారులు బుక్ చేసుకుని లబ్ధిపొందగా ప్రస్తుతం రెండో సిలిండర్ బుకింగ్ నడుస్తోంది.

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దీపం-2 పథకం 2024 నవంబరులో ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను పేదలకు ఉచితంగా ఇవ్వాలనే మహా సంకల్పంతో దీన్ని ప్రారంభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 14 లక్షల మంది దీనికి అర్హులు ఉన్నారు. దీనిలో తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం 12 లక్షల 56 వేల మంది బుకింగ్ చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో రూ.108 కోట్లు సబ్సిడీ సొమ్ము జమ అయింది. 2024, నవంబరు నుంచి 2025, మార్చి నెలాఖరు వరకు బుకింగ్స్ జరిగాయి. లక్షా 44 వేల మంది వివిధ కారణాల వల్ల తొలి గ్యాస్ సిలిండర్లకు బుకింగ్ చేసుకోలేకపోయారు. రెండో ఉచిత గ్యాస్ సిలిండరు పథకానికి గత ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈనెలాఖరుతో గడువు ముగుస్తోంది. రెండో గ్యాస్ సిలిండరుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటివరకు 12 లక్షల 11వేల మంది బుకింగ్ చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో రూ.99 కోట్ల సబ్సిడీ సొమ్ము జమ అయింది. లక్షా 89 వేలమంది ఇంకా బుకింగ్ చేసుకోవాల్సి ఉంది. ఐదురోజులు మాత్రమే దీనికి గడువు ఉంది. ఈలోపు రెండో గ్యాస్ సిలిండరు బుకింగ్ చేసుకోకపోతే తర్వాత అవకాశం ఉండదు. ఆగస్టు 1 నుంచి మూడో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభమవుతుంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే...

కాకినాడ జిల్లాలో..

కాకినాడ జిల్లాలో తొలి గ్యాస్ సిలిండరుకు 4 లక్షల 50వేలమంది బుకింగ్ చేసుకోగా రూ.39 కోట్ల 51లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. రెండో గ్యాస్ సిలిండరుకు 4లక్షల 52వేలమంది ఉచిత గ్యాస్‌కు బుకింగ్ చేసుకోగా రూ.35 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. మిగిలిన వారికి కూడా వారం రోజుల్లో జమ కానుంది.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలి ఉచిత గ్యాస్ సిలిండరుకు 3లక్షల 95 వేలమంది బుకింగ్ చేసుకోగా రూ.34కోట్ల 10 లక్షలు జమయింది. రెండో గ్యాస్ సిలిండరుకు 3 లక్షల 67వేల మంది బుకింగ్ చేసుకోగా రూ.31 కోట్ల 14 లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని అధికారవర్గాలు తెలిపాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో తొలి ఉచితగ్యాస్ సిలిండరుకు 4 లక్షల 5వేలమంది బుకింగ్ చేసుకోగా రూ.35 కోట్ల 50లక్షలు జమ అయింది. రెండో గ్యాస్ సిలిండరుకు 3లక్షల 78వేల మంది బుకింగ్ చేసుకోగా రూ.31కోట్ల 64లక్షలు బ్యాంకు ఖాతాల్లో జమ అయింది.

ఆగస్టు 1 నుంచి మూడో సిలిండరు బుకింగ్ చేసుకోవాలి

ఆగస్టు 1 నుంచి లబ్ధిదారులు మూడో సిలిండరుకు బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకున్న సొమ్ములు జమ కానివారికి మరో వారంరోజుల్లో జమ అవుతాయి. దీపం-2 గ్యాస్ పథకంలో అర్హులు అందరూ బుకింగ్ చేసుకోవచ్చు. ఏమైనా సందేహాలుంటే పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలి. టోల్‌ఫ్రీ నెంబరు 1967కి కూడా కాల్ చేయవచ్చు.

- సత్యనారాయణరాజు, పౌరసరఫరాల శాఖాధికారి, కాకినాడ జిల్లా



రావులపాడు ప్రభుత్వ పాఠశాలలో యు ఆకారంలో బెంచీలు ఏర్పాటుచేసిన ఉపాధ్యాయులు

నో బ్యాక్ బెంచ్!

రావులపాడు ప్రభుత్వ పాఠశాలలో వినూత్న ప్రయోగం

యు ఆకారంలో బెంచీల ఏర్పాటు

రావులపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): క్లాస్ రూమ్‌లో బ్యాక్ బెంచీలో కూర్చునే విద్యార్థులంటే అల్లరి చేసేవారనో, సరిగ్గా చదవని వారనో ప్రచారం. క్లాస్‌రూమ్‌లో బెంచీ వెనుకాల బెంచీ ఉండడం వల్ల పాఠంచెప్పే ఉపాధ్యాయుల దృష్టి కూడా వెనుక ఉన్న విద్యార్థులపై తక్కువగా ఉంటుంది. విద్యార్థులంతా ఉపాధ్యాయులకు కనిపించేవిధంగా బ్యాక్ బెంచీ విధానానికి స్వస్తి పలకాలనే సంకల్పంతో రావులపాలెం మండలం రావులపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయులు వినూత్న ప్రయత్నం చేశారు. పాఠశాలలో యు ఆకారంలో బెంచీలు ఏర్పాటుచేసి అందరూ విద్యార్థులు ఉపాధ్యాయులకు కనిపించే విధంగా విద్యాబోధన చేపట్టే ప్రయోగం చేశారు. గత ఏడాది వినేష్‌విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మళయాళం సినిమా స్థానార్థి శ్రీకుట్టన్ క్లైమాక్స్ సీన్ స్ఫూర్తితో తొలుత కేరళలోని పాఠశాలలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇదే తరహాలో ఇటీవల తిరుపతి జిల్లాలో కూడా యు ఆకారంలో బెంచీలు ఏర్పాటుచేసి విద్యాబోధనచేసే ప్రయోగం చేశారు. దీంతో బ్యాక్ బెంచీ విధానానికి స్వస్తి పలకాలనే విధానంతో విద్యార్థులందరి ముఖాలు స్పష్టం గా ఉపాధ్యాయులకు కనిపించేవిధంగా యు ఆకారంలో బెంచీలను ఏర్పాటుచేసినట్టు హెచ్‌ఎం మధుసూధనరావు అన్నారు.



రాజోలులో..

రాజోలు, జూలై26(ఆంధ్రజ్యోతి): రాజోలులో మండల ప్రజాపరిషత్ కోఆపరేటివ్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.ఏసుబాబు తరగతుల్లో వెనుక కూర్చొని అల్లరి చేసే విద్యార్థులు లేకుండా ఇటీవల సిటింగ్ అరెంజ్‌మెంట్ చేశారు. ఈ విధంగా చేయడం వల్ల ఉపాధ్యాయుడి దృష్టి అందరి విద్యార్థులపై ఉంటుందని ఆయన తెలిపారు. క్లాస్‌రూములో బెంచి వెనుక బెంచి ఉండడం వల్ల పాఠం చెప్పే ఉపాధ్యాయుల దృష్టి కూడా వారిపై తక్కువ ఉంటుందని, దీనికి చెక్ పెడుతూ యు ఆకారంలో బెంచీలు ఏర్పాటు చేసి వినూత్న ప్రయోగం చేశామని, ఇప్పటికే ఈ స్కూల్ మోడల్ స్కూల్‌గా ఉందన్నారు.



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద శనివారం పర్యాటకులు సందడి చేశారు. వారాంతం కావడంతో అధిక సంఖ్యలో విచ్చేశారు. మంత్రి నారా లోకేశ్ ఓఎస్డీ ఆకుల వెంకట రమణ తన స్నేహితులతో కలిసి పొల్లూరు జలపాతాన్ని సందర్శించారు. గతంలో ఆయన ఇక్కడ చింతూరు ఐటీడీఏ పీవోగా చేశారు. వారాంతపు సెలవులు కావడంతో మోతుగూడెం పరిసర ప్రాంతాలన్నింటినీ సందర్శించారు. దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయి తన కుటుంబ సభ్యులతో జలపాతాన్ని సందర్శించారు. జలపాతాల్లో ఆటపాటలు ఆడి సరదాగా గడిపారు.



షూటింగ్ స్పాట్‌లో బోయపాటి

అఖండ 2 షూటింగ్ స్పాట్‌లో..

మోతుగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలోని పొల్లూరు జలపాతం పిక్నిక్ స్పాట్ వద్ద అఖండ-2 సినిమా షూటింగ్ శనివారం జరిగింది. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే ఆరురోజులుగా చిత్రీకరణ జరుగుతోంది. వారం రోజులపాటు సాగే ఈ షెడ్యూల్లో బాలకృష్ణపై కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నామని డైరెక్టర్ బోయపాటి శ్రీను తెలిపారు. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వరుసగా మూడు సినిమాలతో సంచలన విజయాన్ని సొంతం చేసుకోగా, ఈ ఇద్దరు నాలుగో చిత్రం కోసం మరోసారి జట్టు కట్టారు. ఈ చిత్రం విజయవంతమైన అఖండకి సీక్వెల్‌గా అఖండ 2 తాండవం పేరుతో రూపొందుతోంది. రామ్ ఆచంట.. గోపి ఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు.

హరిహర వీరమల్లు.. నేడు విద్యార్థులకు ఫ్రీ షో

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల ప్రత్యేక ఏర్పాటు

రాజానగరం,జూలై26(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాను నియోజకవర్గంలో మూడు మండల కేంద్రాల్లోని థియేటర్లలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత ప్రదర్శన ఏర్పాటుచేసినట్టు జనసేన పార్టీ మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, పది తరగతులు చదువుతున్న విద్యార్థులతోపాటు ఇంటర్, డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థుల కోసం స్పెషల్ షో ఏర్పాటుచేశామన్నారు. రాజానగరంలోని ఫార్చ్యూన్ థియేటర్ లోనూ, సీతానగరంలో గీతా థియేటర్‌లో, కోరుకొండలో రామకృష్ణ థియేటర్‌లోనూ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఉచిత ప్రదర్శన ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.



కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందజేస్తున్న శ్రీప్రకాష్ డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

ఆర్మీ ర్యాలీకి 'శ్రీప్రకాష్' రూ.2లక్షలు విరాళం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో కాకినాడజిల్లా క్రీడా మైదానంలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌ల నిర్వహణకు శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తరపున డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ చెక్కును శనివారం కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఆయన అందజేశారు. ఈనేపథ్యంలో శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్‌ను కలెక్టర్ అభినందించారు.

హేచరీస్ ఓనర్స్ రూ.6లక్షల విరాళం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 26 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు హేచరీస్ ఓనర్స్ రూ.6లక్షలు విరాళం కింద శనివారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కు అందజేశారు. ఈనేపథ్యంలో హేచ రీస్ ఓనర్స్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభి నందనలు తెలిపారు. కాకినాడజిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి విరాళం ఇవ్వడం సంతోషమన్నారు.

ఐసీపీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ, బీటీహెచ్ స్వీడన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రామ్ (ఐసీపీ)లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను వర్శిటీలోని సెనేట్ హాల్లో నిర్వహించారు. మొదటిగా బీటీహెచ్ స్వీడన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.గురుదత్ విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తిచేశారు. బీటెక్ సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ, ఈఈఈ కోర్సులలో ప్రవేశాలకుగానూ 70మంది హాజరుకాగా సీఎస్ఈ, ఏఐఎంఎల్‌లో 28 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. కౌన్సెలింగ్‌లో రెక్టార్ వీవీ సుబ్బారావు, డైరెక్టర్లు రాము, స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

భక్తవత్సల గోవింద.. గోవిందా

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.60.51లక్షలు

ఆత్రేయపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి):కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు చిరుజల్లులను లెక్కచేయకుండా స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.60,51,996లు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కిక్కిరిసిన శృంగారవల్లభస్వామి ఆలయం

పెద్దాపురం : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రూ.1,88,861 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి





వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, తిరువీధులలో ప్రదక్షణలు నిర్వహిస్తున్న భక్తులు

శివభక్తులకు మార్గదర్శిగా యాత్రాదర్శిని పుస్తకం

- ద్రాక్షారామం 108 పాద శివలింగాల యాత్రాదర్శిని పుస్తకం ఆవిష్కరణ



యాత్రాదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాదం బాలకృష్ణ, సాంబశివరావు


సర్పవరం జంక్షన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ రమణయ్యపేట శ్రీపీఠంలో శనివారం పుస్తక ప్రచురణకర్తలు డాక్టర్ గరికి పర్తి నమశ్శివాయ నాగమణి దంపతుల ఆధ్వర్యంలో మంగవతి రచించిన ద్రాక్షారామం 108 పాద శివలింగాల యాత్రాదర్శిని పుస్తకాన్ని శివభక్తులు కాళ్ల సాంబశివరావు, లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాత్రాదర్శిని పుస్తకం శివభక్తులకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. పరిసరాల్లో ఉన్న శివాలయాల వివరాలు, వాటి ప్రాధాన్యం తెలుసు కోవడంద్వారా సులువుగా దర్శనం, పూజలు చేసుకునేందుకు యాత్రదర్శిని పుస్తకం భక్తులకు ఉపయోగపడుతుందన్నారు. నాలుగేళ్లలో 108 శివలింగాలను దర్శించుకుని యాత్రాదర్శిని పుస్తకాన్ని రచించినట్లు రచయిత సాంబశివరావు తెలిపారు. సత్కళావాహిని సభ్యురాలు కుంచి లక్ష్మి ఆధ్వర్యంలో పుస్తక ప్రచురణకర్తలు ఓం నమశ్శివాయనాగమణి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జంపం సంఘం నాయకులు నాగేశ్వరరావు, నాగమణి, మిగడరామం, బీవీఎల్ దాస్, కుంజికా లక్ష్మి, కూచి రామం, ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కాకినాడరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏయూ ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ విధానంలో 2025-26 విద్యాసంవత్సరానికిగానూ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనట్లు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. ఏయూ దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకోసం స్టడీ సెంటర్లో సంప్రదించాలని, ఇతర వివరాలకు 9848405370లో సంప్రదించాలని ఏయూ స్టడీసెంటర్ సమన్వయకర్త కె.నాగేశ్వరరావు తెలిపారు.

ఎర్రకోట వేడుకలకు గోకివాడ సర్పంచ్

- రాష్ట్రంలో పది గ్రామాల సర్పంచ్‌లకు అవకాశం



పిఠాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోటవద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రత్యేక అతిథిగా పాల్గొనేందుకుగానూ పిఠాపురం మండలం గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథబాబు ఎంపికయ్యారు. సతీసమేతంగా ఈ యన అక్కడ జరిగే వేడుకల్లో రాష్ట్రం తరపున ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు వీ ఆర్ కృష్ణతేజ నుంచి సమాచారం అందింది. ఈ వేడుకలకు హాజరయ్యేందుకుగానూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పది జిల్లాల నుంచి పది మంది సర్పంచ్‌లను రాష్ట్రప్రభుత్వం ఎంపికచేసింది. ఇందులో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నుంచి హరనాధబాబుకే అవకాశం దక్కింది. గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషికిగానూ హరనాథబాబుకు ఈ అవకాశం లభించిందని అధికారులు తెలిపారు.



సముద్రం వైపు ఉరకలు వేస్తున్న గోదావరి ప్రవాహం

ఉధృతంగా గోదావరి

- 4,36,321 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజన్లో గోదావరికి మరోసారి ఒక మోస్తరు వరద ప్రవాహం తరలి వస్తోంది. ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తూ ఉండటంతో ధవళేశ్వరంవద్ద నీటి ఉధృతి పెరుగుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ 175 గేట్లను ఒక మీటరు మేర పైకి ఎత్తి 4,36,321క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఆదివారం నాటికి మరో లక్ష క్యూసెక్కులకుపైగా ప్రవాహం పెరిగి 5లక్షల క్యూసెక్కులు దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి నెమ్మదించింది. భద్రాచలం వద్ద 24 గంటల వ్యవధిలో 10 అడుగుల మేర పెరిగిన నీటిమట్టం శనివారం సాయంత్రానికి 35.30అడుగులకు చేరుకుంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్‌బ్యారేజ్ నుంచి 3 డెల్టాలకు 7700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఏమిటి.. ఎందుకు.. ఎలా?

- పుష్కరాలకు.. ఏం చేద్దాం?
- రైల్వేస్టేషన్‌ని పరిశీలించిన పీసీసీఎం రమేశ్

రాజమహేంద్రవరం, జూలై26(ఆంధ్రజ్యోతి):రాజమండ్రి రైల్వేస్టేషన్‌ని ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజన్ ఎన్.రమేశ్ శనివారం పరిశీలించారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, ప్రాంగణం, గూడ్స్‌షెడ్, తూర్పువైపున మూతబడిన రైల్వే స్కూలు తదితర ప్రదేశాల్లో కలియ తిరిగారు. రానున్న గోదావరి పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ప్రధానంగా దృష్టి సారించారు. గత పుష్కరాలకు రోజుకు రాజమండ్రి రైల్వేస్టేషను గుండా రోజుకు 50వేల మంది వరకూ ప్రయాణించారు. ఇప్పుడు ఈసంఖ్య రెండింతలు కావచ్చనే అంచనాలు ఉన్నాయి. దీంతో రైల్వేస్టేషను, బయట ఖాళీ ప్రదేశాలను ఏవిధంగా వినియోగించుకోవాలనే అంశాన్నే ప్రధానంగా తీసుకున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. పుష్కరాలకు అవసరాలు, మౌలిక సదుపాయాలు, ప్రయాణాల అంచనా, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్రవేశ నిర్గమ ద్వారాలు, ప్రయాణికుల హోల్డింగ్ ఏరియాలు, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు ఎక్కడ, ఎలా చేయాలని చర్చించారు. అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాలు, గదులపై ఆరా తీశారు. అక్కడి నుంచే దక్షిణమధ్య రైల్వే జీఎంతో వీడియో కాన్ఫరెన్సింగ్ విధానంలో మాట్లాడారు. విభాగాలవారీగా సమీక్షించారు. స్థానిక అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయలుదేరి కాకినాడ వెళ్లారు. పీసీసీఎం వెంట ఎస్ఎంఆర్ రంగనాథ్, ఆర్పీఎఫ్ పోస్ట్ కమాండర్ రాజు, సీసీఐ కళ్యాణ్, డివిజనల్ అధికారులు ఉన్నారు.



రైల్వేస్టేషన్‌ని పరిశీలిస్తున్న పీసీసీఎం రమేశ్



మూతబడిన రైల్వే స్కూల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎం

అంతర్వేదిలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.50 కోట్లు

అంతర్వేది, జూలై 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పుణ్యక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అత్యంత పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. క్షేత్ర పాలకుడిగా తొలి దర్శనం అందుకుంటున్న స్వామివారి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయ పునఃనిర్మాణం, ముఖ మండపం, నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, ప్రహరీ పునఃనిర్మాణం నిమిత్తం రూ.3.50 కోట్లు దేవదాయశాఖ కామన్ గుడ్‌ఫండ్ నుంచి కమిషనర్ ఉత్తర్వుల మేరకు మంజూరు చేశారని ఇన్‌చార్జి ఈవో వరప్రసాద్ తెలిపారు. మ్యాచింగ్ కంట్రిబ్యూషన్‌గా రూ.కోటి 16లక్షల 67వేలు భక్తుల నుంచి నెల రోజుల్లోపు సేకరిస్తే మిగిలిన రూ.2కోట్ల 33లక్షల 33వేలు నిధులు విడుదల చేస్తారని ఈవో తెలిపారు. భక్తులెవరైనా ముందుకు వచ్చి ఆలయ పునఃనిర్మాణంలో దాతలుగా భాగస్వాములైతే పునఃనిర్మాణ పనులు మరింత వేగవంతంగా జరుగుతాయని పేర్కొన్నారు.

పంపా ఆయకట్టుకు నీరు విడుదల

అన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పంపా రిజర్వాయర్ నుంచి శనివారం ఖరీఫ్ పంటకు ఆకుమడులు వేసుకునేందుకు నీటిని టీడీపీ నాయకుడు యనమల రాజేష్ గంగమ్మతల్లికి పూజలు నిర్వహించి విడుదల చేశారు. ప్రస్తుతం 94 అడుగుల నీటిమట్టం రిజర్వాయర్‌లో ఉండగా ఆకుమడుల కోసం రోజుకు 40 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని, రైతుల అవసరాలకు అనుగుణంగా దీనిని 100 క్యూసెక్కులకు పెంచుతామని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పేర్కొన్నారు.



నీరు విడుదల చేస్తున్న యనమల రాజేష్

జయ..జయ సత్యదేవా

వేడుకగా స్వామివారి ఆవిర్భావ దినోత్సవం
పండితులకు ఘనంగా సత్కారం





సత్యదేవుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం, పండితులను సత్కరిస్తున్న చైర్మన్ రోహిత్

అన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జయ.. జయ సత్యదేవా నామస్మరణతో రత్నగిరి ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి 135వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున 2 గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింపచేశారు. అనంతరం మూలవరులను పంచామృతాలతో అభిషేకించారు. నవగ్రహమూల మంత్రములు, జపములు, పారాయణలు అనంతరం చతుర్వేద పండితులు మహదాశీర్వచనాలు అందజేయగా అనివేటి మండపంలో హోమ పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు. వారు పండితులను ఘనంగా సత్కరించారు. ఆరుగురు పండితులతో పాటుగా 12మంది రిటైర్డ్ వైదిక సిబ్బందిని పంచె, కండువా, నగదు పారితోషకం ఇచ్చి సన్మానించారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో, చైర్మన్ పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా స్వామివారి వెండిరథసేవను నిలుపుదల చేసి ఆలయంలో పల్లకీలో ప్రాకారసేవ నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్యదేవా జూనియర్ కళాశాలలో సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్వామివారి విశిష్టతను విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఘంటశాల వెంకట్ తెలిపారు.

మంత్రి అచ్చెన్న పూజలు

శనివారం సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా చైర్మన్ స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఆలయంలో మంత్రి అచ్చెన్న

మద్యం కేసులో నిందితులు ఎంత పెద్దవారైనా
చట్టం వదిలిపెట్టదు

ప్రతిపక్ష హోదా కూడా లభించని నాయకుడా విమర్శించేది : మంత్రి జనార్ధనరెడ్డి



గోపాలపురంలో మాట్లాడుతున్న మంత్రి

రావులపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో మిథున్‌రెడ్డిని అరెస్టు చేస్తే వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు. మద్యం కేసులో నిందితులు ఎంత పెద్దవారైనా చట్టం వదిలిపెట్టదు. చట్టం అందరికీ సమానమేనని ఆర్అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖామంత్రి బీసీ జనార్ధనరెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి జనార్ధనరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. రూ.4వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో వైసీపీ నాయకులు జైలులో మగ్గుతున్నారన్నారు. మద్యం కేసులో సిట్ దర్యాప్తు జరుగుతున్న కారణంగా ఎక్కువ మాట్లాడదలుచుకోలేదన్నారు. దేశ చరిత్రలోనే ప్రతిపక్ష హోదా కూడా లభించని నాయకుడికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులపై విచారణ జరిపించి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వైసీపీ నాయకులు ఇంటింటికి తిరుగుతామంటున్నారని, గత ఐదేళ్ల పాలనలో వారు చేసిన అరాచకాలు, అక్రమాలను ప్రజల కు చెప్పుకోవడానికా అని ప్రశ్నించారు. ప్రజలు ఛీ కొట్టినా ఇంకా తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలతో వైసీపీ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో ఇసుక దోపిడీ చేసి ఆ సొమ్మును తాడేపల్లి ప్యాలస్‌కు తరలించలేదా అని ప్రశ్నించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒక్క గోపాలపురంలోనే రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ పరదాల చాటున దాక్కుని తాడేపల్లి ప్యాలస్‌లో కూర్చుని బటన్లు నొక్కే పాలన కాదని, నిరంతరం ప్రజాసమస్యలు తెలుసుకుంటూ అభివృద్ధికి సంక్షేమానికి బాటలు వేస్తూ సుపరిపాలన అందించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకులు అయినవిల్లి సత్తిబాబుగౌడ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మరణిస్తున్నానని మెసేజ్!

గోదావరిలో యువకుడి ఆచూకీ కోసం గాలింపు



ఏటిగట్టు వద్ద పోలీసు, రెవెన్యూ, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది



గోదావరిలో గాలింపు దృశ్యం

కె.గంగవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెనికి చెందిన కలిదిండి చంద్రశేఖర్(27) శుక్రవారం చనిపోతున్నానని... సుందరపల్లి వద్ద తన మోటార్‌సైకిల్, ఫోన్ వదిలి వెళ్లిపోతున్నానని తన మిత్రులకు మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి చంద్రశేఖర్ కనిపించలేదు. గోదావరిలో దూకి ఉంటాడని శనివారం ఉదయం నుంచి పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా, తహశీల్దార్ శ్రీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చేపట్టారు. రాత్రి వరకూ గాలింపు జరిగినా ఆచూకీ లభ్యం కాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మూగజీవాల అక్రమ తరలింపు అడ్డగింత

గోశాలకు 20 ఆవులు, 36 దూడలు
పోలీసుల అదుపులో డ్రైవర్

రాజానగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మార్గమధ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ నాగార్జున సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రి సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో పోలీసులను చూసిన పశువుల తరలిస్తున్న వ్యాన్ డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని వ్యాన్ పరిశీలించారు. వాహనంలో 20 ఆవులు, 36 ఆవు దూడలను ఏవిధమైన బిల్లులు లేకుండా తరలిస్తున్నట్టు గుర్తించారు. డాక్టర్ సర్టిఫికెట్లు గానీ, తగు జాగ్రత్తలు గానీ పాటించలేదన్నారు. పశువులను పార్వతీపురం నుంచి హనుమాన్ జంక్షన్‌కు తరలిస్తున్నట్టుగా డ్రైవర్ చెప్పాడన్నారు. పట్టుబడిన పశువులను గోశాలకు తరలించారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఫేస్‌బుక్ పరిచయం... రూ.14.95 లక్షలు మాయం..

ధనవంతుడిని చేస్తానని మోసం చేసిన యువతి
పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

రాజానగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ధనవంతుడిని చేస్తానని ఓ అమ్మాయి పలికిన మాయమాటల వలపుల వలలో చిక్కుకుని వ్యక్తి నిలువునా మోసపోయాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన కొల్లం బాబుకు ఓ అమ్మాయి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. ఆమెతో వాట్సాప్‌లో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. బాబును ధనవంతుడిని చేస్తానని ఆశచూపింది. ఆ తర్వాత ఆమె కొన్ని బ్యాంకు ఖాతాల నెంబర్లు ఇచ్చి సొమ్మును వాటికి ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్ ఫర్ చేయమని చెప్పింది. ఈ విధంగా తొలుత రూ.50 వేలు ఫోన్ పే ద్వారా ఆమెకు పంపిన బాబు. దఫదఫాలుగా రూ.14,95,135ను ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశాడు. బాబు సొమ్మును ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసిన వెంటనే ట్రేడింగ్ ఖాతాలో బాధితుడికి డాలర్ల రూపంలో 5903.57 క్రెడిట్ అయినట్టు చూపించేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సొమ్మును విత్‌డ్రా చేసి తన ఖాతాకు వేయమని తిరిగి బాబు అడగ్గా తన ఎక్కౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, మరో రూ.20 లక్షలు చెల్లించమని చెప్పిన ఆమె ఆ తర్వాత ఆ వ్యక్తి నెంబరు బ్లాక్ చేసింది. దీంతో తనను నమ్మించి మోసం చేసినట్టుగా గుర్తించిన బాబు తనకు న్యాయం చేయాలంటూ రాజానగరం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

ఏపీ శాసన గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా రంప ఎమ్మెల్యే శిరీష

12మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన స్పీకర్ అయ్యన్న



ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ శాసనసభ-శాసన మండలిలకు సంబంధించి సంయుక్త గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్‌గా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియమితులయ్యారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర శాసన సంబంధ వ్యవహారాల్లో భాగంగా పలు రంగాలకు సంబంధించి సంయుక్త కమిటీలను నియమించడం పరిపాటి. రంపచోడవరం నియోజకవర్గం నుంచి తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవికి చైర్మన్‌గా శాసనసభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఆమెతో పాటు గిరిజన ఎమ్మెల్యేలు, మరో ముగ్గురు ఎమ్మెల్సీలు సభ్యులుగా నియమితులయ్యారు. రంపచోడవరం నియోజకవర్గం నుంచి శిరీషతోపాటు వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ను కూడా ఈ కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఇంచు మించు 2 దశాబ్దాల అనంతరం రంపచోడవరం నియోజకవర్గానికి ఎస్టీ కమిటీ చైర్మన్‌గా అవకాశం దక్కింది. గతంలో శీతంశెట్టి వెంకటేశ్వరరావుకు కూడా టీడీపీ ప్రభుత్వం ఎస్టీ కమిటీ చైర్మన్‌గా అవకాశాన్ని ఇచ్చింది. ఆయన తర్వాత మళ్లీ ఇప్పుడు ఈ అవకాశం శిరీషకు దక్కింది. ఈ శాసనసభా కమిటీ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై పరిశీలన, ఇతర రాష్ట్రాల్లో అమలయ్యే గిరిజన సంక్షేమ కార్యక్రమాలపరిశీలన సాగించి ప్రభుత్వానికి నివేదికలను ఇస్తుంది. శిరీష నియామకం పట్ల రంప మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

అల్లూరి కలెక్టర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసు

గిరిజన చట్టాల అమలులో అధికారుల నిర్లక్ష్యం
మెటల్ క్వారీపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఫిర్యాదుతో సంజాయిషీ కోరిన కమిషన్

రంపచోడవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మన్యంలో గిరిజన చట్టాల అమలులో రంపచోడవరంలోని ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై జాతీయ ఎస్టీ కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్‌కు నోటీసు జారీ చేసింది. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను శనివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటన ప్రకారం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం మండలం నరసాపురంలో నడుస్తున్న మెటల్ క్వారీ చట్ట విరుద్ధమని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, రంపచోడవరం సబ్ కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు చేశామని, ప్రాజెక్టు అధికారి స్పందిస్తూ సబ్ కలెక్టర్‌కు తగు ఆదేశాలను ఇచ్చామని చెప్పారని, అయినా చర్యలు లేకపోవడంతో తాము జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తమ ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్ నుంచి సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేసిందన్నారు. ఇకపై అధికారులు చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రతి అంశాన్నీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల మూసివేత

అధిక వర్షాల కారణంగా నిర్ణయం : ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



మాట్లాడుతున్న పీవో

రంపచోడవరం/మారేడుమిల్లి, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): అధిక వర్షాల కారణంగా ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు వాగులు దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. అన్ని పర్యాటక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారంతపు సెలవులు కావడంతో ఈ ప్రాంతానికి పర్యాటకులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో పలు జలపాతాలు తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు తెలిపారు. మారేడుమిల్లి మండలంలోని గుడిసె, చావడికోట, జలతరంగణి, అమృతధార, దుంపవలస, వలస జలపాతాలను మూసివేశామన్నారు. ఆయా జలపాతాల వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు నిఘా ఉంచి పర్యాటకులకు ఎవరూ అటు వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశించారు.

అల్లవరంలో హడలు!

కొబ్బరి రాశుల్లో ఐదు అడుగుల భారీ తాచుపాము



అల్లవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం కొబ్బరి తోటలో శనివారం 5 అడుగుల తెల్ల తాచుపాము హడలెత్తించింది. కొబ్బరికాయలు ఒలుస్తుండగా కార్మికులు తాచుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. వర్మ పామును బంధించి సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టాడు. కొబ్బరికాయల రాశుల్లో ఎలుకలు, కప్పలను తినడానికి పాములు వస్తాయని వర్మ తెలిపాడు.

దళితుడిపై దాడి కేసులో మరో ఇద్దరి అరెస్టు

అమలాపురం డీఎస్పీ

అమలాపురం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): దళితుడిపై అమానుషంగా దాడి చేసిన కేసులో మరో ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని ఆయన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లి గ్రామానికి చెందిన దోనిపాటి మహేశ్వరరావు అలియాస్ మహేష్ రావులపాలెం శ్రీశాంతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. దళితుడైన మహేశ్వరరావుపై ఈనెల 19న పలు పర్యాయాలు అమానుషంగా దాడి చేశారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం అశోక్‌నగర్‌కు చెందిన మల్లాడి సుదర్శన్, అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన తోట నాగవెంకటసత్యనారాయణ అలియాస్ సతీష్‌ను అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో గృహాల వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి మోటారు సైకిళ్లు, కీలకమైన ఆధారాలు ఉన్న మూడు సెల్‌ఫోన్లను, ఫిర్యాదు వద్ద నుంచి బలవంతంగా లాకున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

రామవరంలో పేకాడుతున్న 27 మంది అరెస్టు

రూ.86 వేల నగదు, 6 కార్లు, 18 మోటారు సైకిళ్లు స్వాధీనం

అనపర్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో శనివారం రాత్రి ప్రత్యేక పోలీసుల ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై దాడులు చేసి 27 మందిని అరెస్టు చేశారు. శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. తమకు వచ్చిన సమాచారం మేరకు రామవరం-రాయవరం రోడ్డులో దాడులు నిర్వహించి పేకాడుతున్న 27మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.86,960 నగదు, 18 మోటారుసైకిళ్లు, 6 కార్లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచనున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో బాటు, సీఐ సుమంత్, ఏఎస్ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్ఐ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడలో మత్స్యకారుల ఆందోళన

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బైఠాయింపు



ఆందోళన చేస్తున్న మత్స్యకార మహిళలు

కాకినాడ క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల వద్ద శుక్రవారం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మహిళలు, ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్ మార్చురీ తరలించగా శనివారం వార్పు రోడ్డులో జగన్నాధపురం వంతెన వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబీకులు ఆందోళన బాట పట్టారు. జగన్నాధపురం కొత్తవంతెన, పాత వంతెనలపై మృతుల కుటుంబీకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ట్రావెల్స్ యాజమాన్యం ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 15 వందల మంది మత్స్యకారులు ఆందోళన పాల్గొన్నారు. మత్స్యకార పెద్దలు, ట్రావెల్స్ యాజమాన్యంతో జరిగిన చర్చల నేపథ్యంలో మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం తరలించి అంతిమసంస్కారాలు శనివారం నిర్వహించారు.

భారీ వాహనాలకు బ్రేక్!

దిండి-చించినాడ వంతెనపై ప్రయాణికులకు ఇబ్బందులు

మలికిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వంతెనపై భారీ వాహనాలను నిలుపుదల చేయడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజోలు దీవిలో అత్యధిక శాతం విద్యార్థులు పశ్చిమగోదావరి జిల్లాలోనే విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ దిండి వంతెనపై భారీ వాహనాల రాకపోకల నిషేధం ఇబ్బందిగా మారింది. బస్సులపై దిండి వంతెన వరకు వెళ్లి అక్కడి నుంచి ఆటోపై ప్రయాణాలు చేస్తున్నారు. హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ లగేజీతో దిండి వంతెన నుంచి అవతలకు వెళ్లి బస్సులు ఎక్కుతున్నారు. ఇరువైపులా భారీ వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. పోలీసు సిబ్బంది గస్తీ కాస్తున్నారు. దిండి వంతెన మరమ్మతులకు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరమ్మతులు వెంటనే చేపట్టాలని వారు కోరుతున్నారు.



దిండి వంతెన వద్ద ఆగిపోయిన స్కూల్ బస్సులు

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం



యానాం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యానాం గౌతమి గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శనివారం సాయంత్రం గోదావరి ఒడ్డున ఉన్న నావల పక్క న మృతదేహన్ని గుర్తించారు. వయస్సు 30 ఏళ్ల ఉంటుందని, మృతదేహంపై పచ్చరంగు టీషర్టు, నిక్కరు ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఏటీఎం కార్డు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు యానాం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రామవరంలో చోరీ



చిందరవందరగా ఉన్న ఇంట్లోని వస్తువులు

జగ్గంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలో మేక వీరబాబు ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలకొట్టి రూ.89వేల నగదు, 80తులాల వెండి, బంగారం చెవిదిద్దులు చోరీకి గురైనట్టు మేక వీరబాబు జగ్గంపేట పోలీసుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

వ్యభిచార గృహంపై దాడి

జగ్గంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట శ్రీరామ్‌నగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు శనివారం దాడి చేశారు. మహిళతోపాటు గృహాన్ని నడుపుతున్న యజమాని కాంతమ్మ, ఇద్దరు విటులను పోలీసులు అరెస్ట్ చేసినట్టు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. విటులు, కాంతమ్మపై కేసు నమోదు చేశారు. వ్యభిచారం చేస్తున్న మహిళను ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. వారు ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

విద్యుత్ షాక్‌తో రెండు తాడిపెద్దులు మృతి

తునిరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మార్కెట్ యార్డులో శనివారం విద్యుత్ తీగ తెగిపడడంతో రెండు తాడిపెద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన వ్యాపారులు, కొనుగోలుదారులు భయంతో పరుగులు తీశారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేయగా సరఫరాను నిలుపుదల చేయించారు. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు.



తునిలో మృతిచెందిన తాడిపెద్ది

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్దగల పాడా కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ పీజీఆర్ఎస్‌కు అన్నిశాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులపై అర్జీలు ఇవ్వవచ్చునని చెప్పారు.

సముద్రకోత శాశ్వత నివారణే ప్రభుత్వం లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే వర్మ


మాయాపట్నంలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సముద్రకోత శాశ్వత నివారణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. సముద్రం ఉప్పొంగి కెరటాలు మత్స్యకారుల ఇళ్లల్లోకి ప్రవేశించిన కాకినాడ జిల్లా ఉప్పాడ శివారు మాయాపట్నంలో ఆయన శనివారం పర్యటించారు. రోజు,రోజుకీ సముద్రకోత ఎక్కువ అవుతుందని, కోతనివారణకు పటిష్టమైన పనులుచేసి మత్స్యకారులను ఆదుకోవాలని పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్యే వద్ద వాపోయారు. కెరటాల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పిల్లలకు గాయాలయ్యాయని ఆందోళన చెందారు. 2018లో సముద్రకోత నివారణకు కాంక్రీట్‌వాల్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని మొట్టమొదటి సమావేశంలో సీఎం చంద్రబాబు విపత్తుల విభాగానికి నివేదిక ఇచ్చారని మాజీ ఎమ్మెల్యేవర్మ మత్స్యకారులకు వివరించారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు కోతనివారణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదనే విషయాన్ని మత్స్యకారులకు తెలియజేశారు. గతంలో చంద్రబాబు ఉప్పాడ పర్యటన సందర్భంలో ఉప్పాడను సముద్ర కోత నుంచి రక్షణ కల్పిస్తామని మాట ఇచ్చారన్నారు. అనంతరం టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో రక్షణగోడ నిర్మాణంపై మత్స్యకారులకు హామీ ఇచ్చిన విషయాన్ని మత్స్యకారులకు మాజీ ఎమ్మెల్యే వర్మ వివరించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జియోట్యూబ్ నిర్మాణానికి రూ 323కోట్ల నిధులు ఇవ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలియజేశారు. అనిశెట్టి సత్యానందరెడ్డి, సూరాడ రాజు, భూషణం, అప్పన్న, ననపయ్య సానా రాంబాబు పలువురు మత్స్యకారులు మాయాపట్నంలో పర్యటించారు.

కరపలో తాగునీరు కలుషితం

● పట్టించుకోని అధికారులు..!


కుళాయి పైపు నుంచి వస్తున్న పసర నీరు

కరప, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కరపలో గత కొన్ని రోజులుగా రక్షిత మంచినీరు అందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో కోట్లాది రూపాయలతో ఏర్పాటుచేసిన సమగ్ర రక్షిత మంచినీటి చెరువు(సీపీడబ్ల్యూ స్కీమ్) ద్వారా పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఆ నీటిని ఫిల్టర్ యూనిట్ వద్ద సరైనపద్ధతిలో ప్యూరిఫికేషన్ చేయకుండానే వదిలేస్తున్నారని, దీంతో పైపుల ద్వారా అనేక మలినాలతో కూడిన బురద, పసరనీరు వస్తుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు జల్‌జీవన్‌మిషన్‌లో ఇంటింటికీ ఏర్పాటుచేసిన పైపులైన్ల లీకేజీలవల్ల, కొన్నిచోట్ల ఈ పైపులకు ట్యాప్‌లు ఏర్పాటుచేయకపోవడంవల్లతాగునీరు కలుషితమవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విధిలేని పరిస్థితుల్లో ఈ కలుషిత నీటిని తాగి పలువురు అనారోగ్యాలకు గురవుతున్నారు. రక్షితమంచినీరు అందక పలు అవస్థలు పడుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. కాలందీరిన పైపులైన్లు, అరకొరగా వేసిన జేజేఎం పైపులైన్లు, అక్రమ కుళాయి కనెక్షన్ల కారణంగా తాగునీరు ఎక్కువగా కలుషితమవుతోంది. దీంతో ప్రజలు ఆర్వో ప్లాం ట్‌ల వద్ద అమ్ముతున్న తాగునీటిని వినియోగించుకుంటూ కుళాయి నీటితో ఇతర అవసరాలు తీర్చుకుంటున్నారు. కొంతమంది అయితే పెనుగుదురు బోరు పాయింట్ నుంచి కరప ఓవర్ హెడ్ ట్యాంక్‌కు సరఫరా అవుతున్న రక్షితమంచినీటిని వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి గ్రామస్తులకు సురక్షితమైన తాగునీటిని సరఫరాచేయాలని పలువురు కోరుతున్నారు. ప్రజలకు కనీస మౌలికవసతులను పూర్తిస్థాయిలో కల్పించడమే తన ప్రధాన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ ఎన్నికల సమయంలో పదే పదే ప్రస్తావించారు. దీనిలో ప్రధానమైన పరిశుభ్రమైన తాగునీటిని తక్షణం కరప ప్రజలకు అందివ్వాలని పలువురు విజ్ఞప్తిచేస్తున్నారు.

సారా, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే నవోదయం లక్ష్యం

●ఎక్సైజ్ కమిషనర్ చైతన్య మురళి

కాకినాడరూరల్ జూలై 26(ఆంధ్రజ్యోతి): నాటుసారా, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే నవోదయం 2.0లక్ష్యమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వై.చైతన్యమురళి తెలిపారు. కాకినాడరూరల్ ఇంద్రపాలెంలోని కాకినాడసౌత్ ప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్ సీఐ టి.నిరంజన్‌రావు ఆధ్వర్యంలో కాకినాడ ఏటిమొగలో మత్స్యకారులతో నవోదయం-2.0లో భాగంగా సారా, డ్రగ్స్ సేవించడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, అక్రమ రవాణాచేసేవారికి పడే శిక్షలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా అమ్మకాలు చేయడం, మానకుండా ఉన్న వారిపై పీడీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం విక్రయించినా, రవాణా చేసినా కఠినంగా శిక్ష పడుతుందన్నారు. నాటుసారా తయారు చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 14405కు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, డీపీఈవో ఎం.కృష్ణకుమారి, ఏఈఎస్ రామకృష్ణ, కాకి నాడ డిప్యూటీ తహశీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీ డీఎస్పీగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ


ఎస్పీకి మొక్కను అందజేస్తున్న సత్యనారాయణ

కాకినాడక్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బి) డీఎస్పీగా కేవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సీఐగా పదోన్నతి పొంది అనపర్తి, జగ్గంపేట, కైకలూరు, నూజివీడు సర్కిళ్లలో పనిచేశారు. తదుపరి డీఎస్పీగా పదోన్నతి పొంది కాకినాడ ట్రాఫిక్, ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా అనంతరం పరవాడ ఎస్‌డీపీవోగా, రాజమహేంద్రవరం, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పని చేస్తున్న ఆయనను ప్రభుత్వం కాకినాడ జిల్లా ఎస్‌బీ డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఎస్పీ జి.బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పరిశోధనకోసం అందుబాటులోకి హ్యూమనాయిడ్ రోబోట్


హ్యూమనాయిడ్ రోబోట్‌తో అధ్యాపకులు, విద్యార్థులు

కాకినాడరూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలకోసం కైట్ ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఏఐ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డైరెక్టర్ ఐశ్వర్య తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గల బిద్యుత్ ఇన్నోవేషన్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకుని హ్యూమనాయిడ్ రోబోట్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ రోబోట్‌కు అత్యంత కంప్యూటింగ్ సామర్థ్యంకలదని ఉత్తమ సెన్సార్‌తో ఉండటంవల్ల రియల్‌టైం అప్లికేషన్స్‌లో విద్యార్థులకు పరిశోధనల కోసం ఉపయోగపడుతుందని కైట్ ప్రిన్సిపాల్స్ వై.రామకృష్ణ, డాక్టర్ డి.రేవతి తెలిపారు. ఏఐ, ఎంఎల్, అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ కాన్సెప్ట్‌తో నూతన విధివిధానాలకు తమ విద్యాసంస్థలు హ్యూమనాయిడ్ రోబోట్‌తో నాంది పలికాయని విద్యార్థులు కోడింగ్, ఇన్నోవేషన్‌లో ముం దుకు సాగాలని, ఉన్నతమైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని కైట్ చైర్మన్ పోతుల వెంకట విశ్వం ఆకాంక్షించారు.

30న జాబ్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): అపోలో ఫార్మసీ సంసలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈనెల 30న మంగళవారం ఉదయం 10 గంటలకు కాకినాడజిల్లా ఉపాధి కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించునున్నట్టు జిల్లా ఉపాధి అధికారిని ఇ.వసంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులు మొత్తం 20ఖాళీలు భర్తీకి అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 8639846568కు సంప్రదించాలన్నారు.

'అసంఘటిత కార్మికులకు భరోసా'

పిఠాపురం, జూలై26 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులుగా నమోదు చేయించుకున్న బీమా రక్షణతోపాటు ఆర్థిక భరోసా లభిస్తుందని 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తెలిపారు. పిఠాపురంలోని కోర్టుల ప్రాంగణంలో అసంఘటిత కార్మికులకు కార్మికశాఖ ఆధ్వ ర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సు, నమోదు శిబిరంలో ఆయన పాల్గొన్నారు. నమోదు చేయించుకున్న కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ఏపీపీ బత్తి న లక్ష్మ ణదొర, న్యాయవాదులు ఎస్ఎం ఆలీ, కొంజర్ల అప్పారావు, రమేష్‌బాబు, సత్యవేణి, నూకరాజు, లేబర్ ఆఫీసర్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

పెద్దాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహిళా సమాఖ్య సభ్యులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో ఆమె పాల్గొని శనివారం మాట్లాడారు. మహిళా చట్టాలు, ఉమెన్ ట్రాఫికింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, వేదుల సుబ్రహ్మణ్యం, సీఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక, న్యాయవాదులు, పీఎల్వీలు పాల్గొన్నారు.

సీఆర్మ్ ద్వారా శస్త్రచికిత్సలు సురక్షితం


సీఆర్మ్ పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నెక్కంటి సూర్యప్రసాద్

జీజీహెచ్(కాకినాడ) జూలై 26(ఆంధ్ర జ్యోతి) అత్యాధునిక సీఆర్మ్ పరికరం ద్వారా శస్త్ర చికిత్సలు సురక్షితమని కాకినాడ మెడ్‌వే సంజీవి హాస్పటల్స్ అధినేత డాక్టర్ నెక్కంటి సూర్యప్రసాద్ అన్నారు. అత్యాధునిక సిఆర్మ్ పరికరం మరియు అప్‌డేటెడ్ ఆపరేషన్ థియేటర్‌ను ఆయన వైద్య నిపుణులతో కలిసి శనివారం ప్రారంభించారు. సెంటర్ హెడ్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం'

కాకినాడరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించడమే తమ లక్ష్యమని ఎంఎస్ నారాయణ జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీవిజయ్ అన్నారు. కాకినాడ సూర్యకళామందిరంలో అశోక్‌నగర్‌లోని ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాల సిల్వర్ జూబ్లీ, ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత, కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీ తులసి మాట్లాడుతూ 54ఏళ్ల క్రితం మతుకుమిల్లి ఆదినారాయణ స్థాపించిన నెహ్రూ ఎడ్యుకేషనల్ సొసైటీ సేవాభావంతో నడుస్తున్నదని తల్లిదండ్రులిస్తున్న ప్రోత్సాహం, ఆదరణ సంస్థకు మూలస్థంభాలన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకులు కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాని సూచించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల కరస్పాండెంట్లు నారాయణ, సుజ్ఞాన్, ప్రకాష్, దేవబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌లు ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ) జూలై 26 (ఆంధ్రజ్యోతి) కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో దివిస్ ల్యాబ్స్ సహకారంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌లను రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు రూ.13.50లక్షల నిధులతో ఈ ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటుచేశారు. దివిస్ సంస్థ ఎండీ దివికె మురళీ తరుపున ప్రతినిధులు సుధాకర్, వాసు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాల్లో డీఆర్డీఏ అధికారుల పర్యటన

పిఠాపురం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రుణాలు తీసుకొని చెల్లించకపోవడంతో ఎన్‌పీఏలు మారిన లోన్స్ రికవరీ కోసం డీఆర్డీఏ జిల్లా అధికారులతో కూడిన బృందాలు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పిఠాపురం మండలంలోని పి.దొంతమూరు, వెల్దుర్తి, బి.కొత్తూరు గ్రామాల్లో వీరు పర్యటించి రుణాలు చెల్లించాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. రుణాలు ఎందుకు చెల్లించలేదో ఆరా తీశారు. తాము రుణాలు వీఓఏలకు చెల్లించామని కొన్ని మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. దీనిపై తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని అధికారులు ప్రశ్నించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలి

● డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక సాగర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని శనివారం మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ పప్పులదేవి, ప్రిన్సిపాల్ మువ్వారెడ్డి అచ్చుత రామయ్య, ఒబిలిశెట్టి గున్ని, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లపై వినూత్న ప్రచారం

కాకినాడసిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా శనివారం స్థానిక 35వ డివిజన్‌లో ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రదర్శిస్తూ వినూత్న ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నాయకులు పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి బూరయ్య, మండపాటి ఉదయభాస్క రరాజు, గుజ్జు దుర్గ లక్ష్మణరావు, మద్దూరి బాలకృష్ణ, నాదెళ్ల నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

'అమర వీరుల త్యాగం మరువలేనిది'

కార్పొరేషన్(కాకినాడ), జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కాకినాడ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ సెంటర్‌వద్ద గల అమరవీరుల స్థూపం వరకు కాగడాలు, కొవ్వొత్తులతో ప్లేకార్డ్స్‌తో భారతమాతాకి జై నినాదాలతో శనివారం ర్యాలీ నిర్వహించారు. మాలకొండయ్య, రామ్‌కుమార్, సా యికుమార్ యాదవ్, గౌతు చిన్న పాల్గొన్నారు.

దేశ రక్షణలో సాయుధ దళాలు నిరంతర కృషి

సర్పవరంజంక్షన్: దేశ రక్షణ కోసం ప్రాణాల కు తెగించి భారత త్రివిధ దళాలు నిరంతరం కృషిచేస్తాయని ఆర్మీ రిటైర్డు ఉద్యోగి ఎస్.శ్రీన గేష్, ఎస్.రామారావులు పేర్కొన్నారు. శనివారం స్థానిక బోట్‌క్లబ్‌పార్కులో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్గిల్ దినోత్సవం సందర్భంగా త్రివిధ దళాలకు చెందిన పలువురు రిటైర్డు సైనిక ఉద్యోగస్తులను ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో త్రి విధ దళాలకు చెందిన మాజీ సైనిక ఉద్యోగులు ఎస్.శ్రీనగేష్, ఎస్.రామారవు, బి.శంకర్‌లను ఘనంగా సత్కరించారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

కాకినాడరూరల్: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీకళాశాల ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ ఆధ్వర్యంలో శనివారం విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు జెండాఊపి ప్రారంభించారు. ర్యాలీలో 200మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, ఏఎన్‌వో డా క్టర్ కె.జయదేవ్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పెద్దాపురం: కార్గిల్ వీరుల త్యాగాలు మరువ లేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వే శ్వరరావు అన్నారు. కార్గిల్ వీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ స్థానిక తాళ్లూరి వారి సత్రం లో నిర్వహించిన కార్గిల్ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శనివారం మాట్లాడారు. అనంతరం మాజీ సైనికులను ఆయన పూలమాలలు, దుశ్శాలువా లతో ఘనంగా సత్కరించారు. బొలిశెట్టి రామ్‌కుమార్, కృష్ణారావు, దుర్గా మోహన్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

పేద కుటుంబాలకు చేయూతనివ్వండి

సర్పవరంజంక్షన్, జూలై 26(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో పేదరిక నిర్మూలన కోసం నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. శనివారం కాస్మోపాలిటన్ క్లబ్‌లో కాకినాడరూరల్ నియోజకవర్గ స్థాయిలోగల జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పీ-4పథకం అమలుపై విస్తృత సమావేశం నిర్వహించారు. పేదల ఆదాయ, జీవన ప్రమాణాలస్థాయి పెంచి పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చి మార్గదర్శకులుగా నిలవాలన్న సీఎం చంద్రబాబు ఆశయ సాధన నెరవేరేలా కృషి చేయాలన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు, సంస్థలు, ట్రస్ట్‌లు, వ్యాపార,వాణిజ్య రంగాల ప్రముఖులు, డాక్టర్లు, ఎన్ఆర్ఐలతో పాటూ అవకాశం ఉన్న ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కరెడ్ల గోవిందు, బండారు మురళీ, పెంకే శ్రీనివాస బాబా, రంబాల వెంకటేశ్వరరావు, మాదారపు తాతాజీ, పేరుబాబు, గోపు వెంకటరమణ, పాలిక రమణ తదితరులు పాల్గొన్నారు.

చీడిగలో పీ4 సర్వేపై గ్రామసభ

కాకినాడరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రూరల్‌మండలం చీడిగలో పంచాయతీ కార్యదర్శి బొబ్బిలి గోవిందరాజులు అధ్యక్షతన గ్రామంలో ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వేకు సంబంధించిన నివేదికపై చర్చించేందుకు శనివారం గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ పీ4కు సంబంధించిన అనర్హులను గుర్తించి జాబితానుంచి తొలగించుటకు, అర్హులను ఎంపికచేసి తుది జాబితాను రూపొందించేందుకు గ్రామసభలో చర్చించామన్నారు. అనంతరం ఇటీవల గ్రామసచివాలయంనుంచి వేరే సచివాలయాలకు బదిలీపై వెళ్లిన సిబ్బందిని సత్కరించారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు శ్రీను, మహేష్, అప్పన్న, వెంకటేశ్వరరావు, రామకృష్ణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మడ అడవులను సంరక్షించాలి

● రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్

తాళ్లరేవు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సునామిలనుంచి ప్రజలను రక్షించే మడ అడవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రేంజర్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం కోరింగ ఫారెస్ట్ బంగ్లాలో అంతర్జాతీయ మడఅడవుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఆదిత్య కళాశాల విద్యార్థులకు మడ అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల ఆవశ్యకత, వాటి సంరక్షణ గురించి వివరించారు. హోప్‌ఐల్యాండ్ ప్రాంతం తుఫానుల నుంచి కాకినాడను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికార్లు వీరభద్రరావు, సిద్ధార్థ, ఎఫ్‌బీవోలు మహేష్, ధనుంజయరావు, సంధ్యారాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పిఠాపురంలో రేషన్ దుకాణాలు ప్రారంభం

పిఠాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా రేషన్ దుకాణాలు అందుబాటులో లేక పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువుకాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎట్టకేలకు తీరాయి. అక్కడ నూతనంగా ఏర్పాటుచేసిన రెండు చౌకధరల దుకాణాలను పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. కాలనీలో నాలుగువేలకుపైగా కుటుంబాలు ఉన్నప్పటికి రేషన్ దుకాణాలు లేక రెండు, మూడు కిలోమీటర్లు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి రావడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని పిఠాపురం వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి జనసేన నాయకులు తీసుకువెళ్లారు. దీంతో అక్కడ తక్షణం రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని మంత్రి జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో ఇక్కడ రెండు దుకాణాలు ఏర్పాటు చేసి శనివారం నుంచి సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తమ ఇబ్బందులు తీర్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు కాలనీవాసు లు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, కౌన్సిలర్ కావాడ పోశయ్య, బండి రవి, నాయకులు గాది కోటేశ్వరరావు, జీలకర్ర దొరబాబు, సూరవరపు బాలు, పోలిశెట్టి శేఖర్, గౌతు రాజు, బాలెం సతీష్, సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, నాగేశ్వరరావు, జోగా వెంకటరమణ, బొజ్జా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల ముందే రేషన్

కార్పొరేషన్(కాకినాడ),జూలై 26 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్, మల్లయ్య అగ్రహరంలో శనివారం మధ్యాహ్నం 65ఏళ్ల వయ స్సు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే రేషన్ సరుకులు బీజేపీజిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగుల లబ్ధిదారులకు ఇంటి వద్దనే రేషన్ అందజేయాలని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఈ సందర్భంగా విశ్వేశ్వర గుర్తుచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిదాని సూరిబాబు, సెంట్రల్ మండలం ప్రధాన కార్యదర్శి జంపన రమణయ్య రాజు, సోమిశెట్టి నాగేశ్వరరావు, గోళ్ళ రమేష్, ఎనానాజీ, జగదాంబ గారు పాల్గొన్నారు.

సుందరపల్లికి గేమ్ చేంజర్ అవార్డు అందజేత

కాకినాడ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు సారథ్యంలో సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతుల అవార్డుల ప్రధానోత్సవ వేడుకలలో కాకినాడకు చెందిన ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణకు జాతీయ స్థాయిలో గేమ్ చేంజర్ అవార్డును తెలంగాణ హైకోర్టు జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈఅవార్డు అందుకోవడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ అవార్డును అందజేసినందుకు వరల్డ్ రికార్డ్స్ సంస్థ సీఈవో రాంబాబుయ దంపతులకు, అవార్డు కమిటీసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీల ద్వారా రైతాంగానికి మేలు చేకూర్చాలి

● ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణస్థాయిలో వ్యవసాయాభివృద్ధికి సొసైటీలద్వారా రుణాలు అందిస్తూ రైతాంగానికి మేలుచేకూర్చాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం ఉండూరు పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా బచ్చల వెంకటరమణమూర్తి (జెమీ), సభ్యులుగా మేడిది సుజాత, వెన్నపు వీవీ సత్యనారాయణ ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించి కార్యవర్గాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు. కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, ఇంజనీర్ చక్కని ప్రభాక రరావు, తోటకూర శ్రీనివాసు, గుమ్మళ్ళ రామకృష్ణ, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, అందుగుల జార్జి చక్రవర్తి, కొప్పిరెడ్డి రాజా, కుర్రా నారాయణస్వామి, సర్వేశ్వరరా వు, మునిరెడ్డి శ్రీరాములు, ముసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

గ్రామ సమాఖ్యల రికార్డులకు ఆడిట్ నిర్వహణ

కరప, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం 63 గ్రామ సమాఖ్యలకు సంబంధించిన రికార్డులకు ఆడిట్ నిర్వహించారు. వైజాగ్‌కు చెందిన ఆర్‌వీఎస్ఆర్ అండ్ చార్టెడ్ అకౌంటెంట్ కంపెనీకి చెందిన వెంకటనాని అండ్ టీమ్ 2024-25కు సంబంధించిన గ్రామ సమాఖ్య, మండల సమాఖ్యల రికార్డులను పరిశీలించారు. నివేదికలను అనుసరించి సంబంధిత వీవోలపై శాఖాపరమైన చర్యలుంటాయన్నారు. డీఆర్‌డీఏ తాళ్లరేవు క్లస్టర్ లీగల్ కో-ఆర్డినేటర్ టి.మురళీకృష్ణ, కరప ఏపీఎం ఎంఎస్ బాలాదేవి, సీసీలు ప్రసాద్, పుష్ప, రమామణి, వీవోఏలు పాల్గొన్నారు.

తాళ్లరేవులో సోషల్ ఆడిట్‌పై అవగాహన

తాళ్లరేవు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 18వ విడత సామాజిక తనిఖీలపై కోఆర్డినేషన్ సమావేశం శనివారం ఎంపీడీవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సోషల్ ఆడిట్ సీఆర్‌పీ, ఏపీవో, పంచాయతీ సెక్రటరీలు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సామాజిక తనఖీలుపై చర్చించారు. ప్రతీ గ్రామపంచాయతీలో 4 నుంచి 5 రోజులపాటు ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల ధర్నా

తాళ్లరేవు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయిలను చెల్లించాలని కోరుతూ పటవల పంచాయతీ కొత్తూరు సచివాలయంవద్ద వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. ఉపాధి నిధులు విడుదల చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఉపాధి కూలీలు,వ్యవసాయ కార్మికసంఘం నేతలు పాల్గొన్నారు.

భావనారాయణస్వామి చేపలచెరువుకు వేలం ఖరారు

సర్పవరంజంక్షన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి చెందిన 2.50 ఎకరాల చేపల చెరువు శనివారం వేలంపాట నిర్వహించగా రూ.1.65 లక్షలకు పాడుకున్న వ్యక్తికి వేలంపాట ఖరారు చేసినట్లు ఆలయ ఈవో తలాటం సూర్యనారాయణ తెలిపారు. దీంతో పాటూ స్వామివారికి పూలదండలు, కిరాణా సామాగ్రి సరఫరా చేసేందుకు టెండర్లు పిలవగా తక్కువ ధరకు వేలంపాట దక్కించుకున్న వ్యక్తికి పాట ఖరారు చేశారన్నారు. దేవదాయ, ధర్మదాయశాఖ నిబంధనల మేరకు ఈ రెండింటికీ ఏడాదికి వేలంపాట నిర్వహిస్తామన్నారు.

పెర్‌ఫెక్ట్ పెద్దాపురం పేరుతో క్యాంపెయినింగ్

పెద్దాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణ వైభవాన్ని తెలియజేసేందుకు సోషల్ మీడియా వేదికగా చారిత్రక పరిశోధకుడు, పెద్దాపురం కథలు గాథలు పుస్తక రచయిత వంగలపూడి శివకృష్ణ, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ స్థానిక యువతతో కలిసి పెర్‌ఫెక్ట్ పెద్దాపురం పేరుతో తమ ప్రచారం చేపట్టారు. పెద్దాపురం మహారాజుల చరిత్ర, చారిత్రక విశేషాలు, దర్శనీయ స్థలాలు, కవులు, సుప్రసిద్ధ వ్యక్తులు, ఆధ్యాత్మిక విషయాలు తదితర అంశాలతో పెద్దాపురం చరిత్రను అందరికీ తెలిసేలా తమప్రయత్నాన్ని ప్రారంభిం చారు.

జిల్లా వీవోఏల అడ్‌హాక్ కమిటీ అధ్యక్షురాలిగా పద్మ

సర్పవరం జంక్షన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వీవోఏ (యానిమేటర్లు)ల అడ్‌హాక్ కమిటీ అధ్యక్షురాలిగా ఎస్.పద్మను సభ్యులు ఎన్నుకున్నారు. శనివారం వ లసపాకల కోరమండల్ కమ్యూనిటీ హాల్లో తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) అనుబంధ సంఘం జిల్లా యానిమేటర్ల యూనియన్ సర్వసభ్యుల సమావేశం రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.యానిమేటర్ల అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు.

పంచాయతీ పరిపాలనపై శిక్షణ

సర్పవరంజంక్షన్, జూలై26(ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ మండలం వాకలపూడి గ్రామపంచా యతీలో ట్రైనీ కలెక్టర్ మనీషా గత 13 రోజులుగా పంచాయతీ పరిపాలనపై శిక్షణ తీసుకున్నారు. గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారి, ట్రైనీ కలెక్టర్ మనీషాకు ఈనెల 14 నుంచి 26 వరకు పంచాయతీరాజ్ చట్టం, నియమాలు, పరిపాలనా విధానం, గ్రామసభ, తీర్మానాలు, ఆస్థి పన్ను, వాణిజ్య పన్నులు, విధులు, అధికారాలు,ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై ట్రైనీ కలెక్టర్‌కు అవగాహన కల్పించారు. పంచాయతీ ఆదాయంలో నుంచే సిబ్బంది జీతభత్యాలు, పారిశుద్ధ్య, విద్యుత్తు, తాగునీరు తదితరఅభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. సుమారు 13 రోజుల పాటు పంచాయతీ పరిపాలనా నైపుణ్యం, గ్రామసభ, పంచాయతీల ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన చేసుకున్నట్లు ట్రైనీ కలెక్టర్ మనీషా తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న ట్రైనీ కలెక్టర్ మనీషాను గ్రామ కార్యదర్శి పాండు రంగారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ప్రజా సంక్షేమానికి కృషి

గండేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పని చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని మల్లేపల్లి పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. నూతనంగా నియమితులైన సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, వార్డు నెంబర్ వల్లభశెట్టి వీర్రాజు తదితరులున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మల్లిఖార్జుననాయక్



పైడిగూడెంలో టసర్ సిల్క్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మల్లిఖార్జున నాయక్

చింతూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మల్లిఖార్జున నాయక్ అన్నారు. మల్లిఖార్జుననాయక్ శనివారం చింతూరు, కూనవరం మండలాల్లో పర్యటించారు. ముందుగా కూనవరం మండలం, పైడిగూడెంలో టసర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ శిక్షణ పొందుతున్న ఆదివాసీ మహిళలతో ఆయన మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్ మహిళలకు శిక్షణ అందిస్తున్న తీరుని మల్లిఖార్జుననాయక్‌కు వివరించారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చింతూరు ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో ఆయన ముచ్చటించారు. ఏపీఓ జగన్నాథరావు పాల్గొన్నారు.

అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవిపై ఎమ్మెల్యే హర్షం

రంపచోడవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజుకు గోవా గవర్నర్ పదవి దక్కడంపట్ల రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ టీడీపీలో కష్టించి పనిచేసే వారికి ఎంతటి ఉన్నత పదవులైనా దక్కుతాయని, సీఎం చంద్రబాబు సారథ్యంలో పార్టీ మరింత పురోగమిస్తుందని ఆమె పేర్కొన్నారు.

'ఆ భూములు గిరిజనులకే దక్కాలి'

ఎటపాక, జూలై 26(ఆంధ్రజ్యోతి): గతంలో పోలవరం పరిహారం పొందిన భూములు గిరిజనులకే దక్కాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అన్నారు. మురుమూరు, రాఘవపురం గ్రామాల్లో శనివారం భూ పోరాట కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం పరిహారం పొందిన ముంపు భూములు ప్రభుత్వానికి చెందుతాయని, వాటిని గిరిజనులు సాగు చేసుకోవడం తప్పేమీ కాదని అన్నారు. గిరిజనులకు వ్యతిరేకంగా భూస్వాములకు కొమ్ముకాసే వారిని గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్‌దొర, నాయకులు సొండే రామారావు, ధర్మరాజు పాల్గొన్నారు.

సచివాలయాలు తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

మారేడుమిల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో సున్నంపాడు గ్రామ సచివాలయాన్ని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పరిశీలించి సచివాలయం పరిధిలో జరుగుతున్న పీ4 సర్వే రికార్డులను పరిశీలించారు. ఆదిఖర్మయోగి వివరాలు నమోదులో సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ఆరోగ్య పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రత, దోమల నివారణపై తీసుకోవాలిన చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. ఫాకింగ్ క్రమం తప్పకుండా చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, హెల్పర్ అసిస్టెంట్ రెడ్డి శ్రీలక్ష్మి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి : ఎంపీపీ బంధం శ్రీదేవి

రంపచోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి వచ్చే ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. తాగునీటి సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కుంజం వంశీకృష్ణ, తుర్రం వెంకటేశ్వర్లు, పండమ్మ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజావలి, డీఈవో వై.మల్లేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో రాజుబాబు, ఏటీడబ్ల్యువో రామతులసి, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షణాధికారి జయంతి, డిప్యూటీ తహశీల్దారు జిలాని, ఏపీడీ సత్యనారాయణ ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమతంగా ఉండాలి

అడ్డతీగల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షభావ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమతంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి రచన ప్రజలకు సూచించారు. శనివారం అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులు, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం వల్ల ఈ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదాలు ఉన్నాయన్నారు. పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఎవరికైనా అనారోగ్యంగా అనిపిస్తే స్థానిక ఆసుపత్రిలో వైద్యసేవలు పొందాలని, వైద్యులు 24గంటలు అందుబాటులో ఉంటారన్నారు. చిన్న పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా విష జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తపడవచ్చిని మరో వైద్యుడు హర్ష సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'గిరిజన తెగల్లో విభేదాలు సృష్టిస్తే ఊరుకోం'

రంపచోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని గిరిజన తెగలలో విభేదాలు సృష్టిస్తే ఊరుకోబోమని వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లె చిన నారాయణ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌పీఫంక్షన్ హాల్‌లో వాల్మీకి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన నారాయణ మాట్లాడుతూ ఇటీవల విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.బాబురావు నాయుడు ఆవిష్కరించిన 'ఉనికిని కోల్పోతున్న ఆదివాసీలు' అనే పుస్తకంలో వాల్మీకి తెగ జిల్లాలో కేవలం 546 కుటుంబాలే ఉన్నట్టు తప్పుడు లెక్కలు చూపించడం రాజకీయ కుట్రలో భాగమే అన్నారు. వాల్మీకి తెగ మనోభావాలు దృష్టిలో పెట్టుకుని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు, వాసా సత్యనారాయణ, వజ్రపు అప్పారావు తదితరులు పాలొన్నారు.

వాహనాల తనిఖీ

దేవీపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డి.రావిలంక గ్రామ సమీపంలో దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. గోకవరం నుంచి పజిల్లాబాద్ బీంపల్లి మడిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీల మీదుగా ఇందుకూరు పేట-పోతవరం వెళ్లే కార్లు ఆటోలు, బైకులను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా రికార్డును స్వాధీనం చేసుకుని వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. యువత చదువు, క్రీడల పట్ల శ్రద్ధ కనబరిచి తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సత్తిబాబు జగన్ తదితరులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రాబోయే రోజుల్లో రెండు పంటల నిర్వహణ

'పురుషోత్తపట్నం' నుంచి ఏలేరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు

జగ్గంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రామవరం వద్ద గల పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ఫేజ్2 నుంచి ఏలేరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసేందుకు ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ ఎం.శ్రీనివాసరావు హాజరయ్యారు. వారికి ఇరిగేషన్ అధికారులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి ఏలేరు రిజర్వాయర్ లోకి లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఏలేరు రిజర్వాయర్‌లోకి నీటిని నింపేందుకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి విడుదల చేశామన్నారు. ఏలేరు రిజర్వాయర్ 10టీఎంసీల నీరు మాత్రమే ఉందని దీని వల్ల రాబోయే రోజుల్లో ఆయకట్టు రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. మేమం దరం కలిసి నీటిని విడుదల చేశామని, ముఖ్యంగా ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఏర్పడిన తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి కార్యక్రమం అన్నారు. ఏలేరు ఆయకట్టులోని కాలవలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి రాబోయే రోజుల్లో 2 పంటలకు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నీటి సామర్థ్యం పెంచేందుకు పురుషోత్తపట్నం నుంచి ఆరు టీఎంసీలు నీటిని లిఫ్ట్ చేసేందుకు కూడా ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఊట ఆది విష్ణు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణవర్మ, వీరం రెడ్డి కాశి బాబు, పాఠం శెట్టి మురళీకృష్ణ, భూపాలపట్నం ప్రసాద్, పాఠంశెట్టి రవి, నీలం శ్రీను, కుర్ల చినబాబు, ఈ.శ్రీనివాసులు, ఈఈ వి.ప్రసాదరావు, డీఈఈ ఎస్.ఉమాదేవి ఏఈఈలు ఎస్.నవీన్ సంతోష్, రజనీకాంత్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి

ఏలేశ్వరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు కోర్డు సివిల్ జడ్జి లంక గోపీనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సునీత నేతృత్వంలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని వృథా చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, మోటారు వాహన చట్టం, ప్రయాణాలపై అవగాహన కల్పించారు. ప్రతిపాడు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్.చిట్టిబాబు, ఎస్ఐ రామలింగేశ్వరరావు, ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, అవసరాల దేవి, సుగుణ, నాగేంద్ర, ప్రసాద్, అధ్యాపకులు ప్రయాగమూర్తి, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గంపేట రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం మల్లిశాలకు చెందిన టీడీపీ సీనియర్ నేత పైడిపాల సత్యనారాయణ భార్య శేషయ్యమ్మ అనారోగ్యం క్షీణించడంతో ఆమెను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, సర్పంచ్ సర్వసిద్ధి లక్ష్మణరావు, ముండ్రు ఎర్రబాబు, కానవరెడ్డి రామకృష్ణ, సియాదుల పెద్దకాపు ఉన్నారు.



సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేకు వినతి పత్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే తక్షణం సంబంధిత అధికారులకు సమస్య తెలిపి పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు. మల్లేపల్లిలో తురాయి చెట్టు వద్ద నుంచి వేలిదివారి కాలవ వరకు రోడ్డు అధ్వాన పరిస్థితుల్లో ఉండడంతో తక్షణమే రోడ్డు వేయించాలని మల్లేపల్లి రైతుల తో కలిసి జనసేన జిల్లా కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజే యగా అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా వంటి ప్రజా అవస రాలపై ప్రజా దర్బార్లో తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, గోకాడ రాంబాబు, గల్లా రామచంద్రరావు, కాళ్ల వెంకటేష్, నాగం వెంకటపతి, ఆయిల్ స్వామి, బిట్ర ప్రభాకర్ రావు, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలేశ్వరం నగర పంచాయతీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యవతి



విమర్శలు చేసుకుంటున్న కౌన్సిలర్లు గోపి, గోవింద్

ఏలేశ్వరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్ పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలు హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు వినిపించారు. పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కౌన్సిలర్లు ఆమోదించారు. పట్టణంలో అక్రమ కట్టడాలపై కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, బదిరెడ్డి గోవింద్ మధ్య మాటల యుద్ధం జరిగింది. అనుమతులు లేకుండా 120 గజాల ఖాళీ స్థలంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పట్టణంలో ప్రజలు పలు సమస్యతో సతమతమవుతన్నా కౌన్సిలర్లు నోరుమెదపడం లేదు. చినుకుపడితే రోడ్లు, చెరువులను తలపించే పాఠశాల ఆవరణలు ఉన్నాయి. కౌన్సిలర్లు, అధికారులు పాఠశాలల్లో, వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగు రోజుల ముందే రేషన్ పంపిణీ



వికలాంగుడికి రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్ గూడె రాము

గండేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 31రేషన్ షాపుల్లో శనివారం డీలర్లు వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వయంగా ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. గత వైసీపీ పాలనలో ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్నామని కల్లబొల్లి కబుర్లు చెప్పి రేషన్ వాహనాన్ని ఒక చోట నిలబెట్టి లబ్ధిదారులందరినీ అక్కడికి పిలిపించుకుని రేషన్ ఇచ్చేవారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత విధానంలో మళ్లీ రేషన్ షాపులు వద్దె ఒకటో తేది నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చర్యలు తీసుకోవడంతో పాటు వికలాంగులు, వృద్ధులకు నాలుగు రోజులు ముందే డీలర్లు స్వయంగా ఇంటికి వెళ్లి రేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టింది. దీంతో వికలాంగులు, వృద్ధులు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి అచ్చెన్నాయుడుకు ఘన స్వాగతం



మంత్రి అచ్చెన్నాయుడుకు శాలువా కప్పి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెంనాయుడుకు శనివారం కూటమి శ్రేణులు ప్రత్తిపాడులో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలో కత్తిపూడి, అన్నవరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రత్తిపాడు విచ్చేసిన మంత్రి అచ్చెన్నాయుడును స్థానిక మినర్వా విద్యాసంస్థల వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే సత్యప్రభ మంత్రి అచ్చెంనాయుడుకు బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ నియోజకవర్గ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, మీసాల రాజు, బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, ఇళ్ళ అప్పారావు, వరుపుల రామకృష్ణ, బస్వా ప్రసాద్,బొల్లు కొండబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గానికి రాష్ట్రంలో ఐదో స్థానం

'సుపరిపాలన తొలి అడుగు'లో మంత్రి అచ్చెన్నాయుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్తిపాడు నియోజకవర్గం ఐదో స్థానంలో నిలవడం కార్యకర్తల కృషేనని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అన్నవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతప్రభుత్వం వరుపుల రాజాను ఎంతగా ఇబ్బంది పెట్టిందో మీ అందరికీ తెలుసునని, ఆయన ఆశయసాధనకు ముందుకొచ్చిన వరుపుల సత్యప్రభను మీరందరూ ఆశీర్వదించారని అన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే తనశాఖ కాకపోయినా ఎమ్మెల్యే తమకు ఒక్క మెసేజ్ చేస్తే దాన్ని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు 'బాబు మోసం' అంటూ ప్రచారాన్ని తెరమీదకు వస్తున్నారని, ప్రతి కార్యకర్త దాన్ని తిప్పికొట్టాలని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యప్రభ అనునిత్యం ప్రజల్లో తిరుగుతున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ తన భర్త రాజా మృతితో దిగాలుగా ఉన్న సమయంలో కుటుంబానికి అండగా నిలిచి తనకు పార్టీలో సముచితస్థానం కల్పించారన్నారు. నియోజకవర్గంలో ఉన్న కొన్ని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు గ్రామంలోని వెలంపేటలో మంత్రితో కలిసి కరపత్రాలు పంచుతూ ఏడాది పాలనపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెన్నా శివ, సూర్యనారాయణ రాజు, బద్ది రామారావు, కొమ్ముల కన్నబాబు, స్థానిక నాయకులు బొమ్మిడి సత్తిబాబు, మెరపల నరసయ్య రాజాల చిట్టిబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర



జగనన్న కాలనీలో సిమెంటు రోడ్ల దుస్థితి



జగ్గంపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు గత ప్రభుత్వం జగ్గంపేటలో జగనన్న కాలనీలో 2900మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని, సుమారు వెయ్యి మంది గృహాలు నిర్మించుకున్నారని, సుమారు 500గృహాలు నిర్మాణంలో ఉన్నాయని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో గోతులు, బురద రోడ్లలో ప్రయాణించలేక, త్రాగడానికి నీళ్ల లేక కనీస వసతులు లేక ఎన్నో ఇబ్బందులు పడు తున్నారన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాల నీలో స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మాణానికి ప్రభుత్వం సహకరించిందన్నారు. రహదారి నిర్మాణం, త్రాగునీటి సదుపాయం చేయకపోవడం వల్ల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాకు సిమెంట్ రోడ్లు వస్తాయని ఎదురుచూసిన ప్రజలకు నిరాశే ఎదురైందని, ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి సిమెంట్ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణానికి సమయం పట్టేలా ఉంటే ప్రజలు రాకపోకలకు వీలుగా ఉండే విధంగా కనీసం రోడ్లపై గ్రావెల్ వేయించాలని, త్రాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. అధికారులు, పాలకులు వచ్చి జగనన్న కాలనీలో సమస్యలు పరిశీలించి తక్షణం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు

గండేపల్లి ఎస్ఐకు ఎస్పీ అభినందన



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ శివనాగబాబు

గండేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న నిర్వహించిన మెగా జాతీయ లోక్ అదాలత్ ద్వారా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్ఐను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం ఇచ్చారు.

లాడ్జీల తనిఖీ

గండేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీలాద్రిరావుపేట గ్రామ శివారులో ఉన్న మోహన్ సాయి కృష్ణ, బాలాజీ లాడ్జీలను శనివారం గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు తనిఖీ చేశారు. రికార్డులు, గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లాడ్జిలను సక్రమంగా ఉపయోగించాలన్నారు.

ముద్రగడ కోసం పూజలు

ప్రత్తిపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోలుకోవాలని మండలంలోని పోతులూరులో శనివారం శ్రీకృష్ణుడి ఆలయం వద్ద పూజలు చేశారు. ముద్రగడ క్షేమంగా తిరిగి రావాలని కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో పెద్దఎత్తున ముద్రగడ అభిమానులు ఉన్నారు.

పీ-4 కుటుంబాలను దత్తత తీసుకోవాలి

ఎంఈవో షేక్ బాబ్జి

తొండంగి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీ 4 కుటుంబాలను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, యాప్‌లో నమోదు చేయాలని ఎంఈవో షేక్ బాబ్జి సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఉపాధ్యాయుడు కనీసం కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయనున్న కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల్లో ఉపాధ్యాయులు కూడా భాగస్వాములవుతారన్నారు. పాఠశాలల్లో అందరు ఉపాధ్యాయులు త్వరిత గతిన ఈప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తొండంగి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బెండపూడి వద్ద శనివారం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. కత్తిపూడి నుంచి తుని వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా డేష్ ఇవ్వడంతో కారు అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. కారులో ఉన్న నలుగురికి ఎటువంటి ప్రమాదం సంభవించక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.